



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 349 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు బుధవారం 19 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :349 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE WED 19 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## బీసీ రిజర్వేషన్లపై కేసులు వేస్తే చరిత్రహీనులే

### సీఎం చంద్రబాబు హెచ్చరిక

- బీసీ రిజర్వేషన్ల అంశంపై అసెంబ్లీలో ప్రసంగించిన సీఎం చంద్రబాబు
- స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల పునరుద్ధరణ
- మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ఎన్నిక ఇకపై ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహణ
- గత ప్రభుత్వం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని చంద్రబాబు విమర్శ
- రాష్ట్రంలో జిల్లా ప్రజా పరిషత్‌ల సంఖ్యను 13 నుంచి 28కి పెంచాలని నిర్ణయం



పెన్ పవర్ డెస్క్:బీసీ రిజర్వేషన్ల పునరుద్ధరణపై ఎవరైనా కోర్టుకు వెళ్లి కేసులు వేస్తే, వారు చరిత్రహీనులుగా మిగిలి పోతారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తూ కూటమి ప్రభు త్వం తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని అడ్డుకోవాలని చూసే శక్తులను ప్రజానీకం, చరిత్ర క్షమించవని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం శాసనసభలో బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రసంగించిన ఆయన, గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, తమ ప్రభుత్వ లక్ష్యాలను సవివరంగా ప్రకటించారు.

**కూటమి కేబినెట్ కీలక నిర్ణయాలు**

బీసీల సామాజిక, రాజకీయ అభ్యున్నతి కోసం రాష్ట్ర మంత్రివర్గం మూడు కీలక నిర్ణయాలు తీసుకుందని చంద్రబాబు తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం

- మిగతా 2లో

## మోదీపై వ్యాఖ్యలకు గట్టిగా బదులివ్వాలి

### విశాఖలో బీజేపీ శ్రేణులకు నితిన్ నబిన్ పిలుపు

- ప్రతిపక్షాలు అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్నాయని నితిన్ నబిన్ ఆరోపణ
- కాంగ్రెస్ ప్రజాస్వామ్య సంస్థలను పదేపదే అవమానిస్తోందని విమర్శ
- రాహుల్ గాంధీ ఒక పార్ట్-టైమ్ రాజకీయ నాయకుడని ఎద్దేవా
- యువత ఆకాంక్షలపై దృష్టి సారించాలని పార్టీ నేతలకు సూచన



పెన్ పవర్ డెస్క్: దేశంలోని ప్రతిపక్షాలు అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రతిపక్ష నేతలు ఉపయోగిస్తున్న అనుచిత భాషపై పార్టీ శ్రేణులు సంయమనం పాటిస్తూనే, పార్టీ గౌరవానికి భంగం కలగకుండా దీటుగా సమాధానం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం విశాఖపట్నంలో నిర్వహించిన ఆంధ్రప్ర దేశ్ బీజేపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజాస్వా మ్య వ్యవస్థలను

- మిగతా 2లో

## పెట్టుబడుల్లో ఏపీ దూకుడు.. దేశంలోనే 2వ స్థానం

### చంద్రబాబు విజన్ వల్లేనన్న మంత్రి లోకేశ్



- నూతన పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీకి దేశంలో 2వ స్థానం
- కేవలం 24 నెలల్లోనే 9వ స్థానం నుంచి రెండో ర్యాంకుకు చేరిన రాష్ట్రం
- సీఎం చంద్రబాబు నాయకత్వమే కారణమన్న మంత్రి లోకేశ్
- స్పష్టమైన విజన్, పారదర్శక పాలనే విజయానికి మూలమని వెల్లడి
- ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టి ఇప్పుడు ఏపీపై ఉందని వ్యాఖ్య

- మిగతా 2లో

## దేవాలయ ఉద్యోగాల్లో రాయలసీమకు అన్యాయం జరగలేదు



- రాయలసీమలోని ప్రధాన దేవాలయాల్లో 172 నియామకాలు చేపట్టామన్న ఆనం
- ఉద్యోగాల నియామక ప్రక్రియలో జోనల్ విధానం లేదని స్పష్టీకరణ
- ఖాళీలన్నీ నిబంధనల ప్రకారమే భర్తీ చేస్తున్నామని వెల్లడి

- మిగతా 2లో



## భోగాపురం వెళ్లాల్సిన ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

- శంషాబాద్-భోగాపురం ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు
- ఈ-మెయిల్ ద్వారా అధికారులకు అందిన సమాచారం
- ఎయిర్‌పోర్టులో సీఐఎస్ఎఫ్ విస్తృత తనిఖీలు
- బెదిరింపు మెయిల్‌పై నిఘా వర్గాల ఆరా

పెన్ పవర్ డెస్క్:శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం సాయంత్రం బాంబు బెదిరింపు

- మిగతా 2లో

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా వర్ల రామయ్య, దళవాయి రమ

- గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా వర్ల రామయ్య, దళవాయి రమాదేవి పేర్లు ఖరారు
- అభ్యర్థుల ఎంపికకు ఆమోదం తెలిపిన ఏపీ కేబినెట్
- ఆమోదం కోసం గవర్నర్ వద్దకు చేరిన దస్త్రం
- సీనియారిటీకి, పార్టీ సేవకు గుర్తింపునిచ్చిన టీడీపీ అధిష్ఠానం
- గత ఎమ్మెల్సీల పదవీకాలం ముగియడంతో ఏర్పడిన ఖాళీలు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థుల ను ఖరారు చేసింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సీనియర్ నేత వర్ల రామయ్య, అనంతపురం జిల్లాకు



- మిగతా 2లో



## సీఎం విజయ్ కార్యాలయం మార్పుపై దుమారం..

### టెండర్లలో అవినీతి జరిగిందంటూ ప్రతిపక్షాల మండిపాటు

- సీఎం విజయ్ కార్యాలయం ఫోర్ట్ సెయింట్ జార్జ్ నుంచి నమక్కల్ కవిజ్ఞర్ మాళిగైకి మార్పు
- రూ. 5.5 కోట్ల టెండర్ ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయంటూ బీజేపీ, డీఎంకే ధ్వజం
- పాలనలో పారదర్శకత లోపించిందని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన కార్యాలయాన్ని ఫోర్ట్ సెయింట్ జార్జ్ నుంచి నమక్కల్ కవిజ్ఞర్ మాళిగైకి మార్చాలని తీసుకున్న నిర్ణయం రాష్ట్రంలో తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. సీఎం సిబ్బందికి సౌకర్యవంతమైన పని వాతావరణం కల్పించేందుకు ఈ మార్పు చేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించగా... కొత్త ఆఫీసు పనుల కోసం కేటాయించిన

- మిగతా 2లో

## ముగిసిన ఏపీ కేబినెట్ సమావేశం..

### బీసీ రిజర్వేషన్లు, ప్రత్యక్ష ఎన్నికలకు ఆమోదం!

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం
- స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు ఆమోదం
- పట్టణ స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్
- డెడికేటెడ్ కమిషన్ నివేదికపై లోతుగా చర్చించి నిర్ణయం
- సుమారు 55కు పైగా అజెండా అంశాలపై కేబినెట్‌లో సమీక్ష



పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈ సుదీర్ఘ భేటీలో పలు కీలక నిర్ణయాలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ప్రధానంగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రతిపాదనకు, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలన్న నిర్ణయానికి మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు, స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం పంచాయతీరాజ్ సంస్థల్లో 34.50 శాతం, ఇతర స్థానిక సంస్థల్లో 33.50 శాతం

- మిగతా 2లో

## వందేమాతరం అలా పాడటం నేరమైతే.. గాంధీ, నెహ్రూపైనా కేసులు పెట్టండి

- వందేమాతరం వివాదంపై స్పందించిన ఖర్గే
- సోనియా, రాహుల్‌పై ఫిర్యాదును ప్రశ్నించిన ఖర్గే
- గాంధీ, నెహ్రూ పాడిన వందేమాతరమే పాడామని వివరణ
- అది నేరమైతే వారిపైనా కేసులు పెట్టాలని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వందేమాతరం వివాదంపై తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఫిర్యాదు చేయడాన్ని ప్రశ్నించారు. తాము పాడిన వందేమాతరం కొత్తది కాదని చెప్పారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్



- మిగతా 2లో

## మేము అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి ఇస్తాం

- భూ లక్ష్మి పథకం కింద పేదలకు ఎకరం చొప్పున ఇస్తామన్న కవిత
- రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలేనని విమర్శ
- రాష్ట్రంలో రేవంత్, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ సాగుతోందని ఆరోపణ

- మిగతా 2లో



## ఉరి ద్వారానే మరణశిక్ష అమలు కొనసాగింపు



- ఉరి శిక్షకు బదులుగా తక్కువ బాధ కలిగించే పద్ధతులను అమలు చేయాలంటూ పిటిషన్
- ఉరి తీయడం ద్వారా మరణశిక్ష విధించే పద్ధతే చెల్లుబాటు అవుతుందన్న సుప్రీంకోర్టు
- ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించే స్వేచ్ఛ కేంద్ర ప్రభుత్వానికి ఉందని వ్యాఖ్య

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# తమ ఓట్లను జనసేన కాపాడుకోలేకపోతుందా?

జనసేనకు బూత్ స్థాయిలో కమిటీలు లేవు. మిగిలిన పార్టీల తరహాలో స్ట్రాంగ్ గా లేకపోవడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలా గట్టెక్కగలుగుతామని ఆ పార్టీ నేతలే అభిప్రాయ పడుతున్నారు. పార్టీ పెట్టిన ఇన్నాళ్ల నుంచి జనసేన క్షేత్ర స్థాయిలో బలపడలేదు. ఆ ప్రయత్నమూ పవన్ కల్యాణ్ చేయలేదు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో బూత్ లెవెల్ కమిటీ అవసరాన్ని గుర్తించిన నేతలు ఇప్పటికైనా నియమించకపోతే ఈ ఎన్నికల్లోనూ ఇబ్బందులు తప్పవన్న హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నిన్న అసెంబ్లీ లాబీల్లోనూ జనసేన ఎమ్మెల్యేలు ఈసారి ఖచ్చితంగా స్థానిక సంస్థ ల ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో పోటీ చేస్తామని, అసెంబ్లీ ఎన్నికలకు, ఈ ఎన్నికలకు పొత్తులో భాగంగా సీట్ల పంపిణీ అధికంగా ఉంటుంది. బూత్ స్థాయిలో బలోపేతం అయ్యే దిశగా జనసేన కసరత్తు షురూ చేసింది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ నాయకులు ఉన్నప్పటికీ.. కీలకమైన బూత్ లెవిల్ కార్యకర్తలు జనసేనకు కొరవడ్డారు. ఆది నుంచి కూడా క్షేత్రస్థాయిలో బూత్ కమిటీల ఏర్పాటు, కార్యకర్తల నియామకంపై పార్టీ ఎప్పుడూ దృష్టి పెట్టలేదు. దీంతో క్షేత్రస్థాయిలో డెవలప్ అయ్యేందుకు పార్టీకి ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

**కనీసం నాలుగో వంతు కూడా...**

ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ, టీడీపీ క్షేత్రస్థాయిలో స్ట్రాంగ్ గా ఉన్నాయి. బూత్ లెవెల్ కమిటీలు వాటికి 175 నియోజకవర్గాల్లో ఉన్నాయి. బూత్ లెవెల్ కమిటీలో టీడీపీ టాప్ పొజిషన్ లో ఉంది. దాదాపు 47, 500 వరకూ బూత్ లెవెల్ కమిటీలను టీడీపీ ఏర్పాటు చేసుకుంది. వైసీపీ దాదాపు 45,800 కమిటీలను ఏర్పాటు చేసుకుని అది కూడా బలంగా ఉంది. కానీ జనసేనకు రాష్ట్రం మొత్తం మీద ఏడు వేల కు మించి ఇప్పటి వరకూ బూత్ లెవెల్ కమిటీలు లేకపోవడం గమనార్హం. ఈ కమిటీలు కూడా జనసేన మొన్న గెలిచిన నియోజకవర్గాల్లోనే అధికంగా ఉన్నాయి. మిగిలిన నియోజకవర్గాల్లో మాత్రం అసలు జనసేనకు బూత్ లెవెల్ కమిటీలు లేకపోవడంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా ముందుకు రావడం కష్టమేనని అంటున్నారు.

**ఎస్ఐఆర్ ప్రక్రియలోనూ...**

క్షేత్రస్థాయిలో బలోపేతం కాకపోతే ఎప్పటికీ ఇలాగే ఉండిపోతామని జనసేన నేతలు అంటున్నారు. కూటమి అధికారంలోకి వస్తే తాము ఉంటామని, లేకపోతే అది కూడా లేదని, ప్రభుత్వంలోనూ వారి పెత్తనం కిందే పనిచేయాల్సి వస్తుందన్న అభిప్రాయం జనసేన పార్టీ నేతల్లో వ్యక్తమవుతుంది. స్థానిక సంస్థల ఎన్నికలకుస్థాయి కార్యకర్తల అవసరం చాలా ఉంటుంది. అలాగే ఎస్ఐఆర్ విషయంలోనూ జనసేన అసలు పట్టించుకోలేదు. తమకు మద్దతుగా ఉన్న ఓటర్లను కనీసం కాపాడుకునే ప్రయత్నం చేయడానికి కూడా బూత్ లెవెల్ కార్యకర్తలు లేకపోవడంతో జనసేన దానిపై దృష్టి పెట్టలేకపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పవన్ కల్యాణ్ ముందుగా బూత్ లెవెల్ కమిటీలను ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేయాలని నేతలు కోరుతున్నారు. లేకుంటే వారు ఇచ్చినన్ని స్థానాల మేరకు సరిపెట్టుకోవాల్సి ఉందన్న ఆందోళన వ్యక్తమవుతుంది.

# ముగిసిన ఏపీ కేబినెట్ సమావేశం..

## బీసీ రిజర్వేషన్లు, ప్రత్యక్ష ఎన్నికలకు ఆమోదం!

- మొదటి పేజి తరువాయి

రిజర్వేషన్లు బీసీలకు వర్తింపజేయాలని కేబినెట్ తీర్మానించింది. అయితే, బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ నివేదికపై సమావేశంలో లోతుగా చర్చ జరిగింది. కమిషన్ సిఫార్సులతో 34 శాతం రిజర్వేషన్ల లక్ష్యం నెరవేరడం కష్టమని భావించిన మంత్రివర్గం, ప్రత్యామ్నాయ మార్గాలపై సమీక్షించి తుది నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు త్వరలో జారీ కానున్నాయి.

మరో కీలక నిర్ణయంగా, పట్టణ స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అధిపతులను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానానికి కేబినెట్ అధికారికంగా ఆమోదం తెలిపింది. ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా తీసుకున్న ఈ నిర్ణయానికి తాజా సమావేశంతో చట్టబద్ధత కల్పించారు. ఈ రెండు ప్రధాన అంశాలతో పాటు, దాదాపు 55కు పైగా అజెండా అంశాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి, పలు పాలనాపరమైన, అభివృద్ధి సంబంధిత నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం.

# బీసీ రిజర్వేషన్లపై కేసులు వేస్తే చరిత్రహీనులే

- మొదటి పేజి తరువాయి

రిజర్వేషన్లు కల్పించాలని కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. దీంతో పాటు, పట్టణాల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ఎన్నికను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించామని, ఇది 'ఆయారాం గయారాం' రాజకీయాలకు తెరదించి, సుస్థిరమైన పాలనకు దోహదపడుతుందని వివరించారు. పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రంలోని 28 జిల్లాలకు అనుగుణంగా 28 జిల్లా ప్రజాపరిషత్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

**ఎన్టీఆర్ స్ఫూర్తితో బీసీలకు న్యాయం**

బీసీ రిజర్వేషన్ల విషయంలో తెలుగుదేశం పార్టీకి ముందు, ఆ తర్వాత అని స్పష్టంగా చూడవచ్చని చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన తర్వాతే బీసీలకు రాజ్యాధికారం దక్కిందన్నారు. 1984లో స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనని గుర్తుచేశారు. ఆ స్ఫూర్తితోనే తాను 1995లో ముఖ్యమంత్రిగా యాక్ట్ ఆఫ్ 5 కింద బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించానని, 2013 వరకు జరిగిన అన్ని స్థానిక ఎన్నికల్లో ఇదే కోటాను అమలు చేశామని తెలిపారు. ఎర్రన్నాయుడు, యనమల రామకృష్ణుడు, అయ్యన్నపాత్రుడు, దేవేందర్ గౌడ్ వంటి ఎందరో బీసీ నేతలు టీడీపీ ద్వారానే బలమైన నాయకులుగా ఎదిగారని ఉదహరిం చారు. ఇప్పుడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అదే సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళుతోందని చెప్పారు.

**గత ప్రభుత్వ ద్రోహాన్ని ఎండగట్టిన సీఎం**

గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం బీసీలకు తీరని ద్రోహం చేసిందని చంద్రబాబు తీవ్రంగా ఆరోపించారు. 2019లో జీవో 176 తెచ్చి నాటకాలు ఆడారని, సుప్రీంకోర్టులో సరిగ్గా వాదనలు వినిపించకుండా బీసీల హక్కులను కాలరాశారని విమర్శించారు. జీవోలు 559, 560 ద్వారా 34 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 24.15 శాతానికి తగ్గించి, తద్వారా సుమారు 16,800 బీసీ నాయకత్వ స్థానాలు కోల్పోయేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. "బీసీలకు ద్రోహం చేయటంలో వాళ్లు నెంబర్ వన్" అని ఘాటుగా వ్యాఖ్యానించారు.గత ప్రభుత్వం బీసీ నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని చంద్రబాబు ఆరోపించారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడు, పల్లా శ్రీనివాస్, కూన రవికుమార్ వంటి వారిపై అక్రమ కేసులు బనాయించి వేధించారని గుర్తుచేశారు. రేపల్లెలో అమర్నాథ్ గౌడ్‌ను పెట్రోల్ పోసి తగలబెట్టడం, తోట చంద్రయ్య గొంతు కోయడం, కంచర్ల జాలయ్య, నందం సుబ్బయ్య హత్యల వంటి దారుణాలను ప్రస్తావిస్తూ.. వారు సిద్ధాంతాల కోసం ప్రాణాలు అర్పించారని కొనియాడారు. బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, కనీసం కుర్చీలు కూడా వేయకుండా అవమానించారని దుయ్యబట్టారు.

**బీసీల సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళిక**

తమ ప్రభుత్వం బీసీలకు కేవలం రిజర్వేషన్లు ఇవ్వడమే కాకుండా, వారి సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. "బీసీ అంటే వెనుకబడిన వారు కాదు, అవకాశం రాక వెనుకబడిన వారు" అని అభివర్ణించారు. రాష్ట్ర జనాభాలో 50.54 శాతంగా ఉన్న బీసీల విద్య, నైపుణ్యం, ఉపాధి, పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని, వారి అద్భుతమైన నైపుణ్యాలకు టెక్నాలజీని జోడించి ప్రపంచానికి పరిచయం చేస్తామని హామీ ఇచ్చారు.

**ఎన్నికలు తక్షణావసరం**

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం రాష్ట్ర అభివృద్ధికి అత్యంత కీలకమని ముఖ్యమంత్రి తెలిపారు. ఎన్నికలు నిర్వహిస్తేనే 16వ ఆర్థిక సంఘం నుంచి గ్రామీణ ప్రాంతాలకు రూ.2300 కోట్లు, పట్టణ ప్రాంతాలకు రూ.1,562 కోట్ల గ్రాంట్లు వస్తాయని వివరించారు. ఇంతటి చారిత్రక సమావేశానికి వైసీపీ సభ్యులు హాజరు కాకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ చారిత్రక నిర్ణయానికి సభ ఆమోదం తెలపాలని కోరుతూ, స్థానిక ఎన్నికల్లో కూటమి నేతలంతా కలిసికట్టుగా పనిచేసి, సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రజలకు అందించాలని పిలుపునిచ్చారు.

# పెట్టుబడుల్లో ఏపీ దూకుడు.. దేశంలోనే 2వ స్థానం

నూతన పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానానికి చేరుకుందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కేవలం 24 నెలల వ్యవధిలోనే రాష్ట్రం 9వ స్థానం నుంచి 2వ స్థానానికి ఎగబాకిందని ఆయన వెల్లడించారు. ఈ ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వం వల్లే సాధ్యమైందని లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్, పారదర్శక పాలన, వ్యాపార నిర్వహణలో వేగం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) వంటి అంశాలే ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి మూలస్తంభాలుగా నిలుస్తున్నాయి" అని వివరించారు. రాష్ట్రం వేగంగా పారిశ్రామిక శక్తిగా ఎదుగుతుండటం గర్వకారణమని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సానుకూల వాతావరణంతో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారని లోకేశ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఫలితాలను అందిస్తుండటంతో, ఇప్పుడు ప్రపంచం చూపు ఏపీ వైపు ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

# దేవాలయ ఉద్యోగాల్లో రాయలసీమకు అన్యాయం జరగలేదు

రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో అర్చకులు, వేద పండితుల నియామకాల్లో రాయలసీమ ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరుగుతోందంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల భర్తీ చేసిన మొత్తం 344 పోస్టుల్లో ఏకంగా 172 పోస్టులను రాయలసీమ ప్రాంతంలోని ప్రధాన దేవాలయాల్లోనే నియామకాలు చేపట్టినట్లు వెల్లడించారు. శాసనసభలో దేవాలయాల్లో పోస్టుల భర్తీకి సంబంధించి సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి వివరంగా సమాధానమిచ్చారు. ఈ ఉద్యోగాల నియామక ప్రక్రియలో ఎలాంటి జోనల్ విధానం అమల్లో లేదని స్పష్టం చేశారు. శ్రీశైలం, మహానంది, శ్రీకాళహస్తి, కాణిపాకం వంటి సీమలోని ప్రముఖ క్షేత్రాల్లో ఉన్న ఖాళీలను నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తున్నామని తెలిపారు. ప్రాంతంతో సంబంధం లేకుండా కేవలం వేద, ఆగమ పరిజ్ఞానం, అర్హత, ప్రతిభకే ప్రాధాన్యత ఇచ్చామని మంత్రి వివరించారు. ఎంపిక విధానం అత్యంత పారదర్శకంగా జరగాలనే ఉద్దేశంతో ఇంటర్వ్యూలన్నింటినీ వీడియో రికార్డింగ్ చేయించామని పేర్కొన్నారు. రాయలసీమ జోన్-4 పరిధిలో ఇంకా ఖాళీగా ఉన్న 147 పోస్టులను కూడా త్వరలోనే నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన వెల్లడించారు.

# మేము అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి ఇస్తాం

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే 'భూ లక్ష్మి పథకం' కింద భూమి లేని పేదలకు ఎకరం చొప్పున ఇస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలే కావచ్చు కానీ, పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి అంటే పంచప్రాణాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా ముందుగా పేదల అసైన్డ్ భూములనే లాక్కుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సోదరులు, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ, రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం దాదాపు 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కుందని, ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినట్లుగా పేదల అసైన్డ్ భూములపై వారికే పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని సవాల్ విసిరారు.

రేవంత్ రెడ్డి 'మేకవన్నె పులి' లాంటి వారని... ఆయన చెప్పేది సామాజిక న్యాయం అయితే, చేసేది ఆటవిక న్యాయమని విమర్శించారు. కేబినెట్ తో పాటు ప్రభుత్వ సలహాదారులు, ఆర్టీఐ కమిషనర్ల నియామకాల వరకు బడుగు, బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అగ్రవర్ణాలకు ఒక న్యాయం, పేదలకు మరొక న్యాయం నడుస్తోందని మండిపడ్డారు.

# సీఎం విజయ్ కార్యాలయం మార్పుపై దుమారం..

## టెండర్లలో అవినీతి జరిగిందంటూ ప్రతిపక్షాల మండిపాటు

- మొదటి పేజి తరువాయి

రూ. 5.5 కోట్ల టెండర్ ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయంటూ బీజేపీ, డీఎంకేలు ధ్వజమెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై బీజేపీ నాయకుడు కేశవన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కొత్త ఆఫీస్ పనులు ఇప్పటికే ప్రారంభమైన నెల తర్వాత, ఎలాంటి ఆన్‌లైన్ విధానం అనుసరించకుండా రూ. 5.5 కోట్ల టెండర్‌ను విడుదల చేశారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం వచ్చి కేవలం 100 రోజులు కూడా కాకముందే పాలనలో పారదర్శకత లోపించిందని, నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు కేటాయించడంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మరోవైపు, డీఎంకే ఎమ్మెల్యే ఈవీ వేలు స్పందిస్తూ.. సీఎం తన కార్యాలయాన్ని మార్చుకోవడం ఆయన వ్యక్తిగత విషయమని, అయితే ప్రజాధనంతో ముడిపడి ఉన్న టెండర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న వార్తలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని కోరారు.

అయితే, ఈ అవినీతి ఆరోపణలను ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. తమిళనాడు మంత్రి ఆధవ్ అర్జున మాట్లాడుతూ.. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రితో పనిచేస్తున్న అధికారులకు, సిబ్బందికి కేవలం 100 చదరపు అడుగుల స్థలం కూడా లేదని, వారికి మెరుగైన పని వాతావరణం కల్పించేందుకే ఈ తాత్కాలిక మార్పు చేపట్టామని వివరించారు. ఈ పనులకు సంబంధించి టెండర్లలో ఎలాంటి అక్రమాలు జరగలేదని ఆయన తేల్చిచెప్పారు.

# మోదీపై వ్యాఖ్యలకు గట్టిగా బదులివ్వాలి

- మొదటి పేజి తరువాయి

అవమానపరుస్తోందని నితిన్ నబిన్ విమర్శించారు. "పార్లమెంటులో ప్రతిపక్షాల తీరు, స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల సందర్భంగా కాంగ్రెస్ నాయకుల ప్రవర్తనను యావత్ దేశం గమనించింది. బీజేపీ కార్యకర్తలు ఎల్లప్పుడూ క్రమశిక్షణతో ఉంటారు, అయితే ప్రధానమంత్రి పట్ల ఉపయోగించిన పరుష పదజాలాన్ని ఏమాత్రం ఉపేక్షించకూడదు" అని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని 'పార్ట్-టైమ్ రాజకీయ నాయకుడు' అని ఎద్దేవా చేస్తూ, ఆయన కేవలం ప్రజల దృష్టిని మళ్లించే అంశాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు .ప్రధాని మోదీ నాయకత్వంలో 'వికసిత భారత్' ఆవిష్కారమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందని, దేశవ్యాప్తంగా రూ. 8 లక్షల కోట్లకు పైగా విలువైన మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. నేటి యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, స్టార్టప్‌ల ద్వారా ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగిందని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర పార్టీ ఇన్చార్జిలు, జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఉరి ద్వారానే మరణశిక్ష అమలు కొనసాగింపు

మరణశిక్ష పడిన ఖైదీలకు ఉరిశిక్ష వేసే పద్ధతిని రద్దు చేసి, దానికి ప్రత్యామ్నాయంగా తక్కువ బాధ కలిగించే పద్ధతులను (విషపు ఇంజెక్షన్, కాల్చిచంపడం వంటివి) అమలు చేయాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తిరస్కరించింది.(జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. రాజ్యాంగంలోని సెక్షన్ 354(5) జతీూజ / దీచీూా 393(5) ప్రకారం ఉరి తీయడం ద్వారా మరణశిక్ష విధించే పద్ధతి చెల్లుబాటు అవుతుందని, గతంలో 3-జడ్జిల బెంచ్ (దీనా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు) ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించడానికి పెద్ద బెంచ్‌కు పంపాల్సిన అవసరం లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది.

అయితే, ఈ తీర్పు అంతిమం కాదని, భవిష్యత్తులో శాస్త్రీయ లేదా వైద్యపరమైన ఆధారాలు వచ్చి ప్రత్యామ్నాయ పద్ధతులు మెరుగైనవి అని రుజువైతే ఈ అంశాన్ని మళ్లీ రాజ్యాంగబద్ధంగా సమీక్షించవచ్చని కోర్టు స్పష్టం చేసింది. అలాగే, ఉరిశిక్ష కంటే తక్కువ వేదన కలిగించే ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేసే స్వేచ్ఛ కేంద్ర ప్రభుత్వానికి ఉందని సుప్రీంకోర్టు తెలిపింది.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా వర్ల రామయ్య, దళవాయి రమ

- మొదటి పేజి తరువాయి

చెందిన బీసీ మహిళా నేత దళవాయి రమాదేవిలను శాసనమండలికి నామినేట్ చేయాలని ఏపీ కేబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు సిఫార్సులతో కూడిన దస్త్రాన్ని ఆమోదం కోసం రాజ్ భవన్‌కు పంపింది.గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఉన్న పండుల రవీంద్రబాబు, జాకియా ఖానమ్‌ల పదవీకాలం ముగియడంతో ఈ రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. ఈ నేపథ్యంలో అధికార టీడీపీ, పార్టీకి సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్న ఇద్దరు నేతలకు అవకాశం కల్పించింది. దళిత వర్గానికి చెందిన వర్ల రామయ్య పార్టీలో కీలక నేతగా, గతంలో ఆర్టీసీ చైర్మన్‌గా పనిచేశారు. పార్టీ వాయిస్‌ను బలంగా వినిపించడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2009లో తిరుపతి లోక్‌సభ స్థానం నుంచి ఆయన పోటీ చేశారు.మరోవైపు, అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవి బీసీ (వడ్డెర) సామాజిక వర్గానికి చెందిన నాయకురాలు. రెండు దశాబ్దాలుగా ఆమె పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం అనంతపురం పార్లమెంట్ అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. ఆమె కుటుంబం మొదటి నుంచి టీడీపీకి అండగా నిలుస్తోంది. 2021లో అనంతపురం కార్పొరేటర్‌గా పోటీ చేసిన రమాదేవి, 2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి విశేషంగా కృషి చేశారు.సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని, పార్టీకి విధేయంగా ఉన్న సీనియర్ నేతకు, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మహిళా నేతకు పదవులు ఇవ్వడం ద్వారా టీడీపీ అధిష్ఠానం స్పష్టమైన సందేశం పంపినట్టయింది. ప్రస్తుతం ఈ ఫైల్ గవర్నర్ పరిశీలనలో ఉండగా, ఆయన ఆమోదముద్ర వేయగానే వీరి నియామకం అధికారికంగా ఖరారు కానుంది.

# వందేమాతరం అలా పాడటం నేరమైతే..

## గాంధీ, నెహ్రూపైనా కేసులు పెట్టండి

- మొదటి పేజి తరువాయి

నెహ్రూ పాడినదే తామూ పాడామని స్పష్టం చేశారు. అది నేరమైతే వారిపైనా కేసులు పెట్టాలని వ్యాఖ్యానించారు.ఆగస్టు 15న కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం ఆలాపనపై వివాదం మొదలైంది. ఖర్గే జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన తర్వాత వందేమాతరం ఆలపించారు. అయితే పార్టీ నిర్ణయం ప్రకారం తొలి రెండు చరణాలతో ముగించాల్సిన గేయాన్ని పూర్తిగా ఆలపించారు. గాయకులు కొనసాగించడాన్ని సోనియా గాంధీ గమనించి వారిని ఆపేందుకు ప్రయత్నించినట్లు ప్రచారం జరుగుతోంది.ఈ ఘటనపై సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు అందింది. వందేమాతరం ఆలాపనను అడ్డుకునేందుకు ప్రయత్నించారంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఫిర్యాదుదారు కోరారు. దీనిపై ఖర్గే స్పందిస్తూ.. గత 18 ఏళ్లుగా కాంగ్రెస్ పాడుతున్న వందేమాతరం గీతాన్నే తాజాగా కూడా ఆలపించామని చెప్పారు. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే గేయాన్ని ఆలపిం చిందని గుర్తుచేశారు.వందేమాతరం విషయంలో కాంగ్రెస్ ఎప్పుడో తీర్మానం చేసిందని ఖర్గే తెలిపారు. భవిష్యత్తులో మరో ప్రభుత్వం వస్తే, వారు ఏ నిర్ణయం తీసుకుంటే అది అందరూ పాటించాలా? అని ప్రశ్నించారు.

# భోగాపురం వెళ్లాల్సిన ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

- మొదటి పేజి తరువాయి

కలకలం రేపింది. ఇక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురం వెళ్లాల్సిన ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో విమానాశ్రయ అధికారులు అప్రమత్తమయ్యారు. విమానంలో బాంబు అమర్చినట్లు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందడంతో భద్రతా సిబ్బంది తక్షణమే రంగంలోకి దిగారు.ఈ బెదిరింపు నేపథ్యంలో, విమానాశ్రయ భద్రతా బాధ్యతలు పర్యవేక్షిస్తున్న సీఐఎస్ఎఫ్ బలగాలు వెంటనే తనిఖీలు ప్రారంభించాయి. ప్రయాణికులను సురక్షిత ప్రాంతానికి తరలించి, విమానాన్ని క్షుణ్ణంగా సోదా చేశారు. విమానాశ్రయ ప్రాంగణంలోనూ భద్రతను కట్టుదిట్టం చేసి, విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మరోవైపు, ఈ బాంబు బెదిరింపు ఈ-మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో నిఘా వర్గాలు దర్యాప్తును ముమ్మరం చేశాయి

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం



# ఆలయ భూముల్లో మట్టి దందా

## అధికార పార్టీ నేతల అండతో అక్రమ తవ్వకాలు

## తర్లుపాడు మండలం సీతానాగులవరంలో జెసిబీలతో విచ్చలవిడి

## గుంతలతో ప్రమాదం.. అధికారులు మాత్రం మౌనం

**తర్లుపాడు పెన్ పవర్ ఆగస్టు 18**

తర్లుపాడు మండలంలో మట్టి మాఫియా రోజురోజుకు రెచ్చిపోతోంది. కొందరు అక్రమార్కులు ఆలయ భూముల్లో సైతం జెసిబీలతో మట్టిని తవ్వి లక్షలు గడిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు మాత్రం చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఆంజనేయస్వామి మాన్యంలో విచ్చలవిడి..**

సీతానాగులవరం గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయానికి సంబంధించిన సుమారు 12.5 ఎకరాల భూమిలో గత కొంతకాలంగా అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. జెసిబీలతో తవ్విన మట్టిని టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిస్తున్నారు.

**గుడి ఎండోమెంట్‌లో లేకపోవడమే కారణమా?**

ఆలయం ఎండోమెంట్ పరిధిలోకి రాకపోవడంతో అధికార పార్టీ నాయకుల అండతో అక్రమంగా మట్టి తవ్వుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. రైతులు, గ్రామస్తులు ఫిర్యాదు చేసినా చర్యలు లేవు.

**భారీ గుంతలు.. ప్రమాద హెచ్చరిక...**

తవ్వకాలతో ఆలయ భూముల్లో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలంలో నీరు నిలిచి పిల్లలు పడిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

**ట్రాక్టర్ మట్టి 1500 వరకు..**

మొరస మట్టికి మార్కెట్లో డిమాండ్ ఉంది. ఒక ట్రాక్టర్ మట్టి 1200 నుంచి 1500 రూపాయల వరకు పలుకుతోంది. మార్కాపురం సమీప వెంచర్లకు ఈ మట్టిని తరలిస్తున్నారని స్థానికులు అనుమానిస్తున్నారు.

**ఫిర్యాదు చేసినా ఫోన్లు స్విచాఫ్..**

రాత్రి వేళల్లో జరుగుతున్న తవ్వకాలను విఆర్వో, తాసిల్దారు, ఎస్ఐ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. వాహనాలు సీజ్ చేస్తామని చెప్పి తర్వాత ఫోన్లు స్విచాఫ్ చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు.

**ముడుపుల ఆరోపణలు..**

అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

**బిల్లు నిలిపివేస్తామన్న పీఆర్ఈ..:** జడ్పీ నిధులతో వేస్తున్న గ్రావెల్ రోడ్డుకు సైతం అనుమతులు లేకుండా మట్టి తరలించారనే ఆరోపణలు వచ్చాయి. అనుమతులు లేకుండా తరలించినట్లు తేలితే కాంట్రాక్టర్ బిల్లును నిలిపివేస్తామని పీఆర్ఈ మహంకాళయ్య తెలిపారు.

# పారదర్శకంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

## అధికారులకు దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ రాజాబాబు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 18**



స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడానికి అధికారులు సంసిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై పంచాయతీ అధికారులు, మునిసిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ కమిషనర్ లతో మంగళవారం స్థానిక ప్రకాశం భవనంలో ప్రత్యేక సమావేశము నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బిసి ఓటర్ల ఇంటింటా సర్వే ప్రక్రియ సమర్థంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. 514 పంచాయితీలకు ఎన్నికలు జరగనుండగా, 5,847 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. 10 లక్షల 70 వేల 670 ఓటర్లు ఆ పంచాయతీలో ఉన్నారని వివరించారు. ఇందు కొరకు మంగళవారం నుంచి 22వ తేదీ వరకు సర్వే జరుగుతుందన్నారు. ఈనెల 23 నుంచి 24వ తేదీ వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీల ఓటర్ల గుర్తింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. 25వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తామన్నారు. 26 నుంచి 28వ తేదీ వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ సాగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల విచారణ ప్రక్రియ 29 నుంచి సెప్టెంబర్ రెండో తేదీ వరకు సాగుతుందన్నారు. సెప్టెంబర్ మూడు నుంచి ఆరో తేదీ వరకు ఓటర్ల జాబితా పరిశీలన, ధ్రువీకరించడం వంటి ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సెప్టెంబర్ 7వ తేదీన ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల తుది జాబితా విడుదల చేయాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రజలకు ఈ విషయాలను చేరవేయాలన్నారు. పునర్విభజనతో ఏర్పడిన నూతన డివిజన్ లు, వార్డుల ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ చెప్పారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల వద్ద నోటీస్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియపై ప్రజలకు స్పష్టంగా వివరించాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశాన్ని లిఖితపూర్వకంగా దస్త్రాల్లో పొందుపరచాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అధికారులు, ఉద్యోగులను నియమించుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమర్థంగా నిర్వహించాలని చెప్పారు. కోర్టు కేసులో ఉన్న వాటిని మినహాయించి, మిగిలిన వాటిల్లో ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉండాలన్నారు. ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ లో 50 డివిజన్ లు ఉండగా, డీలిమిటేషన్ ద్వారా 62 డివిజన్ ల ఏర్పాటుకు జాబితా సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణలో స్వల్ప మార్పు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో అదనంగా బ్యాలెట్ బాక్స్ లు సమకూర్చుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఆర్ఓ లు, ఏఈఆర్ఓ లను నియమించుకోవాలన్నారు. సెప్టెంబర్ మూడవ తేదీ నాటికి ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేయాలన్నారు. కందుకూరులో ప్రస్తుతం 30 వార్డులు ఉండగా, డీలిమిటేషన్ ద్వారా 10 వార్డులు అదనం కానున్నాయన్నారు. చీమకుర్తిలో 20 వార్డులుఉండగా, డీలిమిటేషన్ ద్వారా 22కు పెరిగే అవకాశం ఉన్నందున అందుకు సరిపడా బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేసుకోవాలన్నారు. దర్శిలో డీ లిమిటేషన్ ద్వారా 20 నుంచి 28 వార్డులకు, అద్దంకిలో 20 నుంచి 32 వార్డులకు పెరుగుతుందన్నారు. ఆ మేరకు అధికారులు సంసిద్ధం కావాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారిని ఎం.అనుపమ, జడ్పీ డిప్యూటీ సీఈఓ బాలమ్మ, ఒంగోలు మునిసిపల్ కమిషనర్ తుమ్మల వెంకట కృష్ణయ్య, దర్శి కమిషనర్ అర్జున్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ ఫోన్ రాకతో ఫోటోగ్రాఫర్లకు గడ్డు పరిస్థితి

## -ఫోటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం, ఆగస్టు 18**

ఒక ఫోటో ఎన్నిమాటలకు తర తరాలకు తీపి జ్ఞాపకాన్నిస్తుంది. కానీ ఫోటో స్టూడియో ఫోటోగ్రఫీని నమ్ముకున్న వాళ్ళ పరిస్థితి ప్రస్తుతం గడ్డుకాలంగా మారిపోయింది. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన ఫోటోగ్రాఫర్లు ఇప్పుడు దయనీయ స్థితిలో ఉన్నా రు. ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉండడంతో ఎవరికి వారే ఫోటోగ్రాఫర్లగా మారిపోయారు. పైగా హై డెఫినేషన్ పిక్చర్ క్వాలిటీ కెమెరాలు స్మార్ట్ ఫోన్ మార్కెట్లో అందుబాటులో రోజురోజుకు కొత్త మలుపులతో వస్తున్నా యి. వివిధ రకాల యాప్ ల ద్వారా ఫోటోగ్రాఫర్ కంటే మెరుగ్గా తీసుకోగలుగుతున్నారు. ఫోటో స్టూడియో కు వచ్చే వారే కరువయ్యారు. ఫలితంగా ఫోటో గ్రాఫర్లకు ఉపాధి లేకుండా పోయింది. ఒకప్పుడు ఉపాధిగా ఉన్న ఫోటొగ్రఫీ రాను రాను కష్టతరంగా మారిపోతుంది. ముఖ్యంగా స్మార్ట్ ఫోన్ రాకతో ఫోటోగ్రాఫర్లు ఉపాధి గండి పడింది. చిన్న చిన్న



శుభకార్యాలు కూడా ఎవరికి వారే వారి స్మార్ట్ ఫోన్లతో తీసుకుంటున్నారు. వివిధ రకాల యాపుల ద్వారా ఆడియో జోడించి, ఫేస్ బుక్, ఇంస్టాగ్రామ్, యూట్యూబ్లో, ఇతర యాప్ లలో అప్లోడ్ చేసుకొని చూసుకుంటున్నారు.

**స్మార్ట్ ఫోన్, ఫోటోగ్రాఫర్...**


దీంతో ఫోటోగ్రాఫర్ల వద్ద ఉన్న లక్షలు విలువ చేసే ఫోటో కెమెరాలు, వీడియో కెమెరాలు, డ్రోన్లు, స్మార్ట్ ఫోన్ల ముందు దిగదుడుపుగా ఉన్నాయి. సీజన్లో తప్ప తమకు పెద్దగా పని ఉండడం లేదని ఫోటోగ్రాఫర్లు అంటున్నారు. ఒకప్పుడు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, చిన్నపిల్లల బర్తడే, ఫాటోస్, అనేక ఫంక్షన్లకు పండగలకు ఫోటోలు బాగా చేసుకునే వారు. ఇప్పుడు అన్ని ఆన్లైన్ కావడంతో కనీసం పాస్పోర్ట్ సైజ్ బిజినెస్ కూడా లేకపోవడం. ప్రస్తుతం ఎవరికి వారే స్మార్ట్ ఫోన్లో ఫొటోస్ తీసుకుని ల్యాబ్ లలో వారే ప్రింట్ తీసుకుంటున్నారు. అదే కాకుండా జిరాక్స్ సెంటర్లో, మీసేవలలో కూడా చిన్న చిన్న ప్రింటర్లు పెట్టుకొని అక్కడ కూడా పాస్పోర్ట్ లు తీయడం వల్ల అక్కడే తీసుకుంటున్నారు. ఇలా ఉపాధి కోల్పోతున్నామని ఫోటోగ్రాఫర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆన్లైన్ వ్యవస్థ ప్రోత్సహించడంతో కనీసం పాస్పోర్ట్ సైజ్ ఫొటోస్ కూడా చాలా గిరాకీ తగ్గింది. లక్షల్లో పెట్టుబడి పెట్టి స్టూడియోల అద్దెలు కట్టలేక, పనిచేసే వారికి జీతాలు ఇవ్వలేక ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నా రు. వీడియోగ్రాఫర్ల పరిస్థితి దయనీయంగా మారింది. లక్ష ల్లో పెట్టుబడి, లక్షలలో కెమెరాలు కొనుగోలు చేసి వ్యాపారాలు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తీసిన ఫొటోస్ , వీడియోస్ కస్టమర్లు తీసుకోకపోవడంతో కూడా చాలా ఇబ్బంది పడుతున్నామ న్నారు. ఫోటోగ్రాఫర్లను, వృత్తిని నమ్ముకున్న వారందరినీ ప్రభుత్వం ఆదుకోవాలని కోరు తున్నారు. ఫోటోగ్రఫీ వ్యవస్థలో పోటీ బాగా పెరిగింది. సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో అందరూ స్మార్ట్ ఫోన్ల వైపు మక్కువ చూపుతున్నారు. కనీసం పాస్ ఫోటో సైజ్ వ్యాపారం కూడా లేక, సీజన్ లో కూడా వ్యాపారం చాలా తగ్గింది. ఫోటోగ్రాఫర్లకు రాయితీ రుణాలు అందించి ఆదుకోవాలని ఫోటోగ్రాఫర్లు ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఒంగోలు మునిసిపల్ కార్యాలయం పై ఏసీబీ దాడి

## - లంచం తీసుకొని పట్టుబడిన ఇన్చార్జ్ ఆర్ఐ నరేంద్ర

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 18**

ఇంటి పన్ను లో పేరు మార్పు కొరకు అర్జీ పెట్టుకున్న కొప్పోలు సమీపంలోని ఇందిరా కాలనీ నివాసి రమేష్ రెడ్డి వద్ద 15 వేల రూపాయలు లంచం డిమాండ్ చేసి తీసుకున్న ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఇంచార్జ్ ఆర్ ఐ ఎస్.వి. నరేంద్రను మంగళవారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు చెప్పిన వివరాల మేరకు... కొప్పోలు సమీపంలోని ఇందిరా కాలనీ కు చెందిన రమేష్ రెడ్డి తన తండ్రి నుంచి వచ్చిన స్థలంలో ఉన్న రేకుల షెడ్డు స్థానంలో బిల్డింగ్ కట్టుకున్నారని, సదరు బిల్డింగ్ కి పన్ను వేయటం అదేవిధంగా తండ్రి పేరున ఉన్న పన్ను తన పేరు మీద మార్చుకోవడానికి ఆర్ఐ నరేంద్ర ను కలవగా 15 వేల రూపాయలు అవుతాయని చెప్పినట్లు ఆ నగదు ను అందజేసిన వెంటనే ఇచ్చిన నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకుని నరేంద్ర ను అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. లంచం తీసుకుంటూ పట్టబడిన నరేంద్ర పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, అతని ఇంట్లో కూడా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని ఏసీబీ అధికారులు తెలిపారు. లిరెండో సారి నరేంద్ర పై ఏసీబీ దాడిలి ఒంగోలు నగరపాలక సంస్థలో నరేంద్ర ఈ-2గా విధులు నిర్వహిస్తూ నే ఇన్చార్జి ఆర్ఐ గా విధులు నిర్వహిస్తున్నారు. ఇతనిపై గతంలో అక్రమాస్తులు కలిగి ఉన్నారని ఎసిబి నిర్ధారించి రిమాండ్ కు పంపించడం కూడా జరిగింది. ఇప్పుడు మరో మారు రూ.15,000/- లు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడటం ఒంగోలు నగర పాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఏ మేరకు నిజాయితీగా ప్రజలకు



విధులు నిర్వహిస్తున్నారో పాలకులు గ్రహించాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి

## - జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

## - వివిధ అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టరేట్ నుంచి వీక్షణ సమావేశం

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 18**





పి.జి.ఆర్.ఎస్. లో నమోదైన ప్రతి అర్జీకి నాణ్యతా ప్రమాణాలతో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. వివిధ అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. నాణ్యత ప్రమాణాలతో అర్జీలను పరిష్కరించక పోవడంతోనే పునరావృతం అవుతున్నాయని కలెక్టర్ చెప్పారు. అర్జీలు పునరావృతం గాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పీజీ ఆర్ఎస్, ఐ.వి.ఆర్.ఎస్. పై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా సమీక్షిస్తున్నందున అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. పరిష్కారమైన ప్రతి అర్జీకి సంబంధించిన అర్జిదారుడికి ఫోన్ కాల్స్ వెళ్తాయన్నారు. పరిష్కరించకుండానే పరిష్కారమైనట్లు చూపితే అలాంటి అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. పీజీఆర్ఎస్ పై నిర్లిప్తంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి ఒక్క అర్జీదారుడికి న్యాయం చేయాలనే తాత్పర్యంతో అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. పునరావృతం అవుతున్న అర్జీలపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఒంగోలు ఆర్డిఓ కు 20 శాతం అర్జీలు పునరావృతం అవుతున్నాయని, అలాగే కందుకూరు ఆర్డీవో వద్ద అధికంగా నమోదవడంపై ఆరా తీశారు. డి ఆర్ ఓ వద్ద నాలుగు, జిల్లా పంచాయతీ అధికారి వద్ద నాలుగు, వివిధ శాఖలో నమోదవడంపై ప్రశ్నించారు. అధికారులు తమ పనితీరు మార్చుకోవాలని సూచించారు. పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. పారిశుద్ధ్యంపై 65 శాతమే ఐ వి ఆర్ ఎస్ లో ప్రజా ఆమోదం నమోదు కావడంపై ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో చెత్త సేకరణ పక్కాగా జరిగేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయి చెత్త సేకరణ, పారిశుధ్యంపై అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. పాఠశాలల్లో పారిశుధ్యం 61శాతమే ఉండడం ఏమిటని నిలదీశారు. గుంతల రహిత రహదారులపై 64 శాతమే సానుకూలత ఉందన్నారు. పారిశుధ్యం పచ్చదనం పెంచాలని సూచించారు. ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయం బాగుండాలి, ప్రజల నుంచి మంచి స్పందన లభించేలా అధికారులు పనిచేయాలన్నారు.

తాగునీటి సమస్య రాకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం లేనందున, తాగునీటి సమస్య ఉత్పన్నం అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో బోర్లు మరమ్మతు చేయాలని, వినియోగంలో లేని బోర్లను వినియోగంలోకి తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో తాగునీటి సమస్య ఉత్పన్నం గాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే విద్యుత్ సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ ఐ ఆర్ లో 1.96 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేశామన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఓటర్లకు చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అద్దంకిలో 47% ఇవ్వకపోవడం ఏమిటి అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, మండల స్థాయిలో తహసిల్దార్లు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయం లోనేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి




**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 18**

గిద్దలూరు శాఖా గ్రంథాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు తొలుత నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పుష్ప మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు విశ్రాంత బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి మాట్లాడుతూ నేతాజీ దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటం దేశభక్తి, ధైర్యసాహసాలు యువతలో జాతీయ స్ఫూర్తిని నింపిన ఆయన సేవలను స్మరించుకున్నారు ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని దేశ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు ప్రసన్న కుమారి కుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటి ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి వాసవి జాగృతి మిత్ర మండలి క్లబ్ అధ్యక్షులు వంశీ కృష్ణ యువ ప్రగతి పథంస్వచ్ఛంద సంస్థ వ్యవస్థపకులు సయ్యద్ ఫరూఖ్ తదితరులు హాజరయ్యారు.

# ఉత్తమ మండల విద్యాశాఖ అధికారి గిరిధర్ శర్మకు ఘన సన్మానం



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 18**

గిద్దలూరు పట్టణానికి చెందిన వారణాసి గిరిధర్ శర్మ ప్రస్తుతం రాచర్ల మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తూ 80వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత చేతుల మీదుగా ఉత్తమ మండల విద్యాశాఖ అధికారిగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గిద్దలూరు హై స్కూల్ ప్లస్ ప్రిన్సిపాల్ సిద్దేశ్వర శర్మ ఆధ్వర్యంలో పాఠశాల సిబ్బంది కలిసి దుశ్శాలువతో, పూలమాల, జ్ఞాపిక తో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా సిద్దేశ్వర శర్మ మాట్లాడుతూ గిరిధర్ శర్మ సేవలు అభినందనీయమని ప్రశంసించారు. ఎన్.సి.సి ఆఫీసర్ డాక్టర్ మొర్రి. పిచ్చయ్య మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయులందరితో స్నేహపూర్వకంగా ఉంటు పనిచేయిస్తూ రాచర్ల మండలాన్ని అన్ని విషయాల్లో ముందు వరుసలో నిలుపారన్నారు. ఈ కార్యక్రమంలో బాల గురవయ్య, స్వామి కుమార్, విజయరాజు, శ్రీరామిరెడ్డి, సగీర్,పీరయ్య, శోభారాణి మరియం బీబీ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొని గిరిధర్ శర్మకు శుభాకాంక్షలు తెలిపారు.

# అనుమానమే కారణం..

## భర్తను కొట్టి చంపిన భార్య తండ్రి, సోదరుడు



**పీసీపల్లి, పెన్ పవర్ ఆగస్టు 18**

మండలంలోని మూలవారిపల్లి గ్రామంలో దాంపత్య కలహాలు విషాదంగా మారాయి. భార్యను అనుమానంతో వేధిస్తున్న భర్తను, ఆమె కుటుంబ సభ్యులు కలిసి హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం మూలవారిపల్లికి చెందిన మూల పుల్లారెడ్డి కుమార్తె ధనలక్ష్మికి పామూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కందుల శ్రీకాంత్ రెడ్డితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీకాంత్ రెడ్డి భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకుని ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. దీంతో సుమారు 4 ఏళ్ల క్రితం ధనలక్ష్మి ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వచ్చేసి, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో పది రోజుల క్రితం శ్రీకాంత్ రెడ్డి మూలవారిపల్లికి వచ్చి భార్యతో కలిసి ఉంటున్నాడు. ఈనెల 10 న మళ్లీ గొడవపడి ధనలక్ష్మి పై దాడి చేశాడు. మనస్తాపానికి గురైన ధనలక్ష్మి ఫినాయిల్ తాగగా, ఆమెను కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. 13న ఆమె డిశ్చార్జ్ అయింది. ఆ తర్వాత కూడా 14న శ్రీకాంత్ రెడ్డి ఇంటికి వచ్చి మరోసారి గొడవకు దిగాడు. దీంతో ధనలక్ష్మి తన తండ్రి పుల్లారెడ్డి, సోదరుడు మల్లికార్జున రెడ్డికి విషయం చెప్పింది. ఆగ్రహంతో ముగ్గురు కలిసి కర్రలు, రోకలి బండతో శ్రీకాంత్ రెడ్డిపై దాడి చేశారు. తీవ్ర గాయాలతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం 17.08.2026 సాయంత్రం 6 గంటలకు నిందితులైన ధనలక్ష్మి, పుల్లారెడ్డి, మల్లికార్జున రెడ్డిని అరెస్ట్ చేశారు. మంగళవారం 18న ముగ్గురిని కనిగిరి జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.

# గుండ్రెడ్డిపల్లిలో కార్డెన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించిన పోలీసులు

**గిద్దలూరు రూరల్ సీఐ జె. రామకోటయ్య ఆధ్వర్యంలో ఆపరేషన్ నిర్వహణ**

**ముమ్మరంగా ఇల్లు, గడ్డి వాములు, వాహనాలు తనిఖీ**

**రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, దొంగతనాలు, మహిళలు, బాలికలపై వేధింపులు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించిన సిఐ రామకోటయ్య**

**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 18**

కొమరోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండ్రెడ్డి పల్లె గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున గిద్దలూరు రూరల్ సీఐ జే రామకోటయ్య ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఆ సందర్భంగా సిఐ రామకోటయ్య తో పాటు కొమరోలు ఎస్సై నాగరాజు రాచర్ల ఎస్సై శివ, అధిక సంఖ్యలో పోలీస్ సిబ్బంది ఆ గ్రామంలో ఇళ్లను,గ్రామాల వెలుపలగల గడ్డివాములు తదితర ప్రాంతాలతో పాటు వాహనాల తనిఖీ ముమ్మరంగా చేపట్టారు. ఆ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని ద్విచక్ర వాహనాలను, ఆటోలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆ సందర్భంగా సిఐ రామకోటయ్య మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు, పోలీసుల సూచనలు సలహాలు హెచ్చరికలు తప్పనిసరిగా పాటించాలని,ద్విచక్ర వాహనాలు నడిపే వ్యక్తులు, వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ తప్పనిసరిగా తరలించాలని, కార్లు జీవులు తదితర వాహనాలు నడిపే డ్రైవర్లు డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న వ్యక్తి సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని ఆయన సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడే వారికి జైలు శిక్ష జరిమానాలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్ ను రిసీవ్ చేసుకోవద్దని, వాట్సాప్ ద్వారా వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని, అనుమానిత మెసేజ్లకు స్పందించవద్దని ఆయన తెలిపారు. ఆన్లైన్ అరెస్టులంటూ మోసగాళ్లు చేసే ఫోన్ల సమాచారాలకు భయపడి





మోసపోవద్దని , అలాంటి సమాచారం అందిన వెంటనే 1930 కు కాల్ చేసి సైబర్ పోలీసులకు సమాచారం అందించాలని లేదా సమీప పోలీస్ స్టేషన్కు వెళ్లి సమాచారం తెలియజేయాలని ఆయన తెలిపారు. గ్రామాలలో దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానస్పద వ్యక్తులు సంచారం, కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించి దొంగతనాలు, దోపిడీలు తదితరు వాటిని నివారించేందుకు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు, ఆన్లైన్ బెట్టింగ్లకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తు వైపు పయనించాలని కోరారు. నేరాలు చేసి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయితే యువత భవిష్యత్తు అంధకారం అవుతుందని, అందువల్ల యువకులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. మహిళలు, బాలికలపై వేధింపులు అత్యాచారాలు తదితర వాటికి పాల్పడే వారు కఠిన జైలు శిక్ష అనుభవించక తప్పదని ఆయన హెచ్చరించారు. ప్రజల భద్రత,శాంతి భద్రతల పరిరక్షణ లో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగ గలవని అందువల్ల ప్రజలు పోలీసు నిబంధనలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఆ కార్యక్రమంలో కొమరోలు,గిద్దలూరు పోలీస్ స్టేషన్ల సిబ్బంది,గుండ్రెడ్డిపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రకాశం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలి : సిపిఎం

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 18**

ప్రకాశం జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె మాబు ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని అన్ని మండలాల్లో సాధారణ వర్షపాతంతో పోలిస్తే 60 శాతానికిపైగా లోటు ఉన్నట్లు వాతావరణ పరిస్థితులు వెల్లడిస్తున్నాయని మాబు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు ఒకటిరెండు ప్రాంతాల్లో అడపాదడపా వర్షాలు మినహా ఎక్కడా సాధారణ స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదన్నారు. దీంతో రైతులు ఖరీఫ్ సాగుపై ఆశలు వదులుకునే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 1,39,435 ఎకరాల్లో పంటలు సాగు కావాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 10,545 ఎకరాల్లోనే సాగు జరిగిందని తెలిపారు. ఇది సాధారణ సాగు విస్తీర్ణంలో కేవలం 7.56 శాతం మాత్రమేనన్నారు. వరి సాగు పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందన్నారు. ఖరీఫ్ లో 25,355 ఎకరాల్లో వరి సాగు కావాల్సి ఉండగా కేవలం 3,857 ఎకరాల్లో మాత్రమే సాగు జరిగిందని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆహార ధాన్యాల కొరత ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ఇతర పంటల సాగు పరిస్థితి కూడా ఆశాజనకంగా లేదన్నారు.



**పశుగ్రాసం.. నీటి కొరత....**

వర్షాభావం వ్యవసాయంతో పాటు పశు పోషణపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోందని మాబు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పశుగ్రాసం కొరత తీవ్రంగా ఏర్పడిందని, పాడి రైతులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. చెరువులు, కుంటలు, బావులు, పంట కాలువలు సహా నీటి వనరులు అడుగంటడంతో పశువులకు మేత, నీరు లభించని పరిస్థితి ఏర్పడిందన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారులు చిన్న జీవాలకు తాగునీరు అందించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే పశుగ్రాసం సరఫరా చేయడంతోపాటు గ్రామాల్లో నీటి తొట్లు ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా పశువులు, గొర్రెలు, మేకలకు నీటిని అందించాలని డిమాండ్ చేశారు. కొత్త ఉపాధి హామీ నత్తనడకన సాగుతున్నాయని మాబు తెలిపారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ కూలీలకు సమ్మర్ అలవెన్స్ కొనసాగించాలని, ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టి పని కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు రైతులు, వ్యవసాయ కూలీలు, పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులకు అవసరమైన సహాయక చర్యలను ప్రభుత్వం కొనసాగించాలని ఎస్‌కె మాబు కోరారు.

# తక్కువ నీటితో ఎక్కువ దిగుబడిని ఇచ్చే పంటలను రైతులు సాగు చేయాలి

**జిల్లాలో తాగునీటికి ఇబ్బందులు కలగకుండా చర్యలు - తక్షణ స్పందనకు**

**కలెక్టరేట్లో కాల్ సెంటర్ 1077 టోల్ ఫ్రీ నంబర్ - జిల్లా కలెక్టర్ రాజాబాబు**

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 18**

జిల్లాలో త్రాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందీ తలెత్తకుండా ప్రత్యేక దృష్టి పెట్టినట్లు కలెక్టర్ పి. రాజాబాబు చెప్పారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఎక్కువగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్న నేపథ్యంలో జిల్లాలోని పరిస్థితిని, అధికార యంత్రాంగం చేపట్టిన చర్యలు, భవిష్యత్తు కార్యాచరణను మంగళవారం ప్రకాశం భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరించారు. ఈ ఏడాది వర్షాలు తక్కువ కురుస్తాయని నిపుణులు చెప్తున్నందున నీటి వినియోగం ఎక్కువగా ఉండే పంటలు వేయవద్దని రైతులకు ఇప్పటికే అవగాహన కల్పించామన్నారు. వీటికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలను, సాగు విధానాలను రైతులకు వివరించామన్నారు. జిల్లాలో సుమారు 37 లక్షల పశువులు ఉన్నాయన్నారు. త్రాగునీటికి, పశువుల అవసరాల కోసం నీటి లభ్యత, పంపిణీ తీరును నిరంతరం పరిశీలిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో 51 రైతు సేవా కేంద్రాల పరిధిలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుందని, 261 కేంద్రాల పరిధిలో మధ్య స్థాయిలో, 64 కేంద్రాల పరిధిలో తక్కువ స్థాయిలో నీటికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో పశువులకు నీటి కోసం 12131 బోర్లను మ్యాపింగ్ చేశామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ప్రధానమైన రామతీర్థం, గుండ్లకమ్మ రిజర్వాయర్లలోని నీటితో సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను నింపినట్లు చెప్పారు. ఫలితంగా ఆయా చెరువులలో సుమారు 55 శాతం నీరు ఉన్నట్లు వివరించారు. వచ్చే నెలాఖరు నాటికి నాగార్జునసాగర్ నీళ్లు వస్తాయని, వాటితో చెరువులను పూర్తిస్థాయిలో నింపుతామన్నారు. అందుబాటులో ఉన్న నీటిని కేవలం త్రాగునీటి అవసరాలకే వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. సాగు అవసరాలు, చేపల చెరువులకు మళ్లిస్తే కఠిన చర్యలు



తీసుకుంటామని ప్రకటించారు. పశుగ్రాసానికి ప్రస్తుతం ఇబ్బంది లేదని, భవిష్యత్తులోనూ ఈ విషయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటినుంచే చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

**1077 టోల్ ఫ్రీ నెంబర్**

త్రాగు, పశుపోషణకు నీరు రాకపోయినా, బోర్లు, మోటార్ల సమస్యలు తలెత్తినా తక్షణమే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని ప్రజలకు కలెక్టర్ పిలుపునిచ్చారు. దీనికోసం కలెక్టరేట్లో 1077 టోల్ ఫ్రీ నంబరుతో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఇది ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుందన్నారు. అవసరమైతే 24 గంటలూ పనిచేసేలా చూస్తామన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే అధికారులు 24 గంటల్లోనే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు. పరిస్థితిని బట్టి ప్రత్యామ్నాయంగా టాంకర్ల ద్వారా కూడా నీటిని సరఫరా చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆర్.డబ్ల్యు. ఎస్. ఎస్.ఈ. నాగేశ్వరరావు, జడ్పీ డిప్యూటీ సీఈవో జాలమ్మ పాల్గొన్నారు.

# తోకపల్లి వద్ద గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం



**పెద్దారవీడు పెన్ పవర్ ఆగస్ట్ 18**

మండల పరిధిలోని తోకపల్లి సమీపంలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన మంగళవారం వెలుగుచూసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..తోకపల్లి నుంచి రాజంపల్లికి వెళ్లే మార్గంలోని పిచ్చిచెట్లలో ఒక మహిళ మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానిక ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్సై సైదుబాబు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.ఈ సంఘటనపై మార్కాపురం ఓఎస్డీ నవజ్యోతి మిశ్రా, ఎర్రగొండపాలెం వై.పాలెం సీఐ అజయ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తీవ్రంగా పరిశీలించారు. మృతికి గల కారణాలపై అన్ని కోణాల్లో విచారణ వేగవంతం చేశారు. ఎస్సై సైదుబాబు కేసు నమోదు చేసి, ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

# వెలుగొండ నిర్వాసితుల బైక్ ర్యాలీ

**3 నెలల సమయం, పునరావాస ప్యాకేజీ డిమాండ్**






**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 18**

వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం పట్టణంలో నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో మోటారు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కంభం సెంటర్ నుండి ప్రారంభమై గడియార స్తంభం సెంటర్, దోర్నాల బస్టాండు, సెవెన్ హిల్స్, విశ్వేశ్వర థియేటర్, తేరు వీధి, రాజీ వీధి, కోర్టు సెంటర్, కరెంట్ ఆఫీసు మీదుగా శ్రీనివాస సినిమా హాల్ సెంటర్ వరకు సాగింది. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.ర్యాలీలో పాల్గొన్న నిర్వాసితులు మాట్లాడుతూ గ్రామాలను ఖాళీ చేసేందుకు కనీసం 3 నెలల సమయం ఇవ్వాలని, 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులకు పునరావాస ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి పునరావాస ప్యాకేజీ వచ్చేంత వరకు గ్రామాలు ఖాళీ చేయబోమని తెలిపారు. వెలుగొండ నిర్వాసితుల సంఘం సహ-సంయోజకుడు దగ్గుపాటి సోమయ్య మాట్లాడుతూ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ర్యాలీలో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు అనుబంధ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డీకేఎం రఫీ, భారత ప్రజాతాంత్రిక యువజన సమాఖ్య నాయకులు ఏనుగుల సురేష్ కుమార్, కొర్రపోలు దేవసహాయం, కొర్రపోలు బద్రి, దొండపాటి రవి, వై.చిన్న అక్కులయ్య, బెజవాడ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి

## వ్యవసాయ అధికారి ప్రకాష్ రావు





**కొనకనమిట్ల పెన్ పవర్ ఆగస్టు 18**

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో పత్తి రైతు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి ప్రకాష్‌రావు సూచించారు.మండలంలోని చినమనగుండం,గొట్లగట్టు గ్రామాల్లో నిర్వహించిన 'పొలం పిలుస్తుంది' కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు చేశారు.ఎల్‌నినో కారణంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుని నైరుతి రుతుపవనాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు.వర్షాలు తగ్గితే జలాశయాలు,భూగర్భ జలమట్టాలు పడిపోయి సాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు.ముఖ్యంగా వర్షాధారిత పత్తి సాగులో వర్షాలు ఆలస్యం కావడం మధ్యలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడటం వల్ల పంట దిగుబడిపై ప్రభావం పడుతుందన్నారు.పత్తిలో పూత,పిందె దశలో తగినంత తేమ అందకపోతే పూత,పిందె రాలిపోవడంతో పాటు కాయల అభివృద్ధి మందగించే అవకాశం ఉందన్నారు.అధిక ఉష్ణోగ్రతలు,పొడి వాతావరణం కారణంగా తెల్లదోమ,తామర పురుగులు,ఇతర రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.రైతులు పంటను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలు గుర్తించిన వెంటనే వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకోవాలని కోరారు.అలాగే నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పొదుపు పద్ధతులు పాటించడం పంటలో తేమను కాపాడుకోవడం పురుగు నివారణలో శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని ప్రకాష్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి విక్రమ్,వ్యవసాయ సహాయకులు,గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ప్రత్యేక పూజలు నిర్వహించిన ముత్తుముల అభిమానులు



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 18**

మార్కాపురం మండలం, చింతగుంట్ల గ్రామంలో వెలసిన శ్రీ "అంబామల్లేశ్వర నాగవీరాంజనేయ స్వామి" వారి ఆలయంలో గిద్దలూర శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆయన కుటుంబ సభ్యుల పేర్ల మీద ముత్తుముల అభిమానులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కీ భగవంతుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని వారికి వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు కలిగి విజయాలు చేకూరాలని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముత్తుముల అభిమానులు దూదేకుల దస్తగిరి, బొర్రా రాఘవేంద్ర యాదవ్, పిడతల రవితేజ, గిద్దలూరు మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య టిడిపి నాయకులు బిల్లా రమేష్ యాదవ్ మరియు మూల వెంకటరామిరెడ్డి, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి జిల్లా కార్యదర్శిగా తిరుమలరావు

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 18**



భారతీయ జనతా పార్టీ ప్రకాశం జిల్లా కార్యదర్శిగా పిన్నింటి తిరుమలరావు ఎంపికయ్యారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహరహం కృషి చేసినందుకు, జిల్లాలో పార్టీ బలోపేతం కోసం తన వంతు పాత్ర పోషించిని పిన్నింటి తిరుమలరావు ను జిల్లా కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు పలువురు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శిగా తన పేరును సిఫార్సు చేసిన జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాస్ రావు, రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ నిడమానూరి కళ్యాణ చక్రవర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పివి శివారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మాకినేని నరసింహం లకు తిరుమల రావు కృతజ్ఞతలు తెలియజేశారు. భారతీయ జనతా పార్టీ తనపై నమ్మకం ఉంచి ఇచ్చిన ఈ గౌరవప్రదమైన స్థానాన్ని నిలబెట్టుకోవడానికి విశేషంగా కృషి చేస్తానని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు గెలుపు కోసం పార్టీ పెద్దల సహకారంతో నేటి నుంచే తన వంతు పాత్ర పోషిస్తానని తిరుమల రావు పేర్కొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే వెనక్కి తీసుకోవాలి

**– ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామ అంకయ్య డిమాండ్**

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 18**




కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు, చట్టాల స్థానంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామా అంకయ్య డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏఐటీయూసీ కేంద్ర సమితి పిలుపుమేరకు స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ధర్నా కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు టంగుటూరి ప్రభాకర్ అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా దామా అంకయ్య మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్ లతో కార్మికులు సంఘం ఏర్పాటు చేసుకుని హక్కును, పని గంటలను, సమ్మె చేసే హక్కును, ఉద్యోగ భద్రతను కోల్పోతున్నారని దుయ్యబట్టారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర మెడలు వంచి నాలుగు లేబర్ కోడ్ లు వెనక్కి తీసుకునే వరకు కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 8 గంటల పని విధానాన్ని తిరిగి అమలు చేయాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, పని ప్రదేశాలలో మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డే హనుమారెడ్డి, ఏఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ కె హనుమంతరావు, బేవరిస్ కార్పొరేషన్ రాష్ట్ర నాయకులు లోకేష్, ఇన్సాఫ్ నాయకులు ఎస్కే సాలర్, సిపిఐ సీనియర్ నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, కారుమూడి నాగేశ్వరరావు, ఎలక్ట్రికల్ ముఠా నాయకులూ హనుమంతరావు, రిమ్స్ సెక్యూరిటీ యూనియన్ నాయకులు సుబ్బారావు, ఎస్ పోలేరయ్య, ఆర్టీసీ ముఠా నాయకులు గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# జగన్ ను కలిసిన వైస్ ఎంపీపీ భూమి రెడ్డి దంపతులు



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 18**

వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజన, వైసీపీ మాజీ యూత్ అధ్యక్షుడు భూమిరెడ్డి వెంకటరెడ్డి దంపతులు మంగళవారం వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని కలిశారు. కుటుంభ సభ్యులతో కలిసి మంగళవారం విజయవాడ వెళ్ళి తాడేపల్లి లోని క్యాంపు కార్యాలయం లో జగన్ మోహన్ రెడ్డి ని కలిసి వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేసి, సన్మానించారు. నియోజక వర్గం లో పార్టీ అభివృద్ధి కి కృషి చేయాలని ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి తెలిపినట్లు భూమిరెడ్డి వెంకట రెడ్డి తెలిపారు. వీరి వెంట జగన్ మోహన్ రెడ్డి ని కలిసిన వారిలో పాలుగుళ్ళ వెంకటరెడ్డి, భూమిరెడ్డి రాజ్ కుమార్ రెడ్డి లు ఉన్నారు.

# సెప్టెంబర్ 12న జరిగే జాతీయ లోక్ ఆధాలత్ ను కక్షి దారులు సద్వినియోగం చేకునేల అవగాహన కల్పించాలి



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 18**

సెప్టెంబర్12.న జ రుగబోయే జాతీయ లోక్ అదాలత్ నందు ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా కక్షిదారులకు అవగాహన కల్పించ వలసినదిగా న్యాయవాదులతో జరిగిన సమీక్ష సమావేశం నందు గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ ఎ. ఓంకార్ తెలియజేశారు. తద్వారా విలువైన సమయమును, ధనమును ఆదా చేసుకొని, అప్పీలు లేని అవార్డును పొందవలసినదిగా కక్షిదారులకు తెలియజేయాలని తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ నందు అన్ని రకముల సివిల్ కేసులు, భరణం కేసులు, గృహహింస కే సులు, చెక్ బౌన్స్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు , కోర్టుల వరకు వెళ్లని ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ చేసుకోవలసినదిగా కక్షిదారులకు తెలియజేయాలని కోరారు. అనంతరం ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె. భరత్ చంద్ర మాట్లాడుతూ గిద్దలూరు లోని మూడు కోర్టుల యందు అన్ని రకముల సివిల్ , క్రిమినల్ కేసులు భారీ సంఖ్యలో పెండింగ్ లో ఉన్నందున, కక్షిదారులు ముందుకు వచ్చి , తమ కేసులను రాజీ చేసుకుని, ప్రశాంత జీవితమును గడపాలని జడ్జి ఆకాంక్షించారు .ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షులు ఏ. తిరుమల ప్రసాద్ జనరల్ సెక్రటరీ బి. ఐ జాక్ ,అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఎం .రంగారెడ్డి, సీనియర్ న్యాయవాదులు యస్.వి నాగేంద్రబాబు,యస్.వి. భాస్కరరావు, పి. రాజశేఖర్ రెడ్డి ,బి. వెంకటేశ్వరరావు,కె.హిమశేఖర్ రెడ్డి ,సి.హెచ్. పోలయ్య ,ఎస్.వి చలపతిరావు, ఎం. హజరాంబి, షేక్. ఉస్మాన్ షరీఫ్,కె. పోలయ్య, బి. ప్రకాష్,పి.నిరంజన్ కుమార్ ,కె.సత్య సులోచన, బి. గిరి, జి. ఆనంద్ కుమార్ జూనియర్ న్యాయవాదులు ఎం. ప్రభాకర్ రెడ్డి ,వి.వి.ఎన్. సుధీర్ కుమార్, బి. సంధ్యారాణి, ఎం.ఏ రైడర్ బాబు, ఎస్.కె. ఫాజిల్ ,బి .సిద్దయ్య, పి. లావణ్య యస్.ఉదయ్ మొదలగువారు పాల్గొన్నారు..తర్వాత జరిగిన ట్రైనింగ్ పొందిన 8 మంది మధ్య వర్తులకు జరిగిన సమావేశం నందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ. ఓంకార్ మాట్లాడుతూ ప్రస్తుతము మీడియేషన్ ఫర్ నేషన్ 3.0 ప్రకారం కేసుల గుర్తింపు జరుగుతున్నదని, మధ్యవర్తిత్వమునకు పంపిన కేసుల యందు ఇరు పార్టీలతో సామరస్య పూర్వకముగా మాట్లాడి, కేసులు రాజీ అయ్యే విధముగా తగిన చర్యలు చేపట్టవలసినదిగా ఆదేశించారు.మధ్యవర్తిత్వం ద్వారా కేసులు రాజీచేసుకొనటం వలన కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు తెలియజెప్పాలని జడ్జి తెలియజేశారు. ఫేజ్ వన్, ఫేస్ టు ద్వారా జరిగిన మీడియేషన్ లో 42 కేసులను రాజీ చేయటం జరిగినదని ఈ సందర్భంగా జడ్జి తెలియజేశారు.

# ఆగస్టు 31 లోపు వరి పంటకు బీమా నమోదు చేసుకోవాలి

**ఎంఏఓ బి.రవికుమార్**







**గుడ్లూరు, పెన్ పవర్, ఆగస్టు 18:**

ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు సంబంధించి వరి పంటకు బీమాను ఈనెల 31వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.రవికుమార్ రైతులకు తెలిపారు. మండలంలోని గుండ్లపాలెం మరియు గుడ్లూరు-2 రైతు సేవా కేంద్రాల పరిధిలోని గ్రామలలో మండల వ్యవసాయ అధికారి రవికుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వ్యవసాయశాఖ మరియు అనుబంధ రంగాలు పొలం పిలుస్తోంది వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ కార్యక్రమం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తమ సిబ్బందితో ఆయా గ్రామాలలో గల రైతులకు పంటల భీమా నమోదు, వాటి ఉపయోగాలు గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎం.ఏ.ఓ రవికుమార్ మాట్లాడుతూ ఖరీఫ్-2026 సీజను కి వరి పంటకు గాను భీమా చివరి తేది 31 ఆగస్టు వరకు పొడిగించబడినదన్నారు. కావున రైతులు పంట ధృవీకరణ ఐన తక్షణమే తగిన అదరాలతో ప్రీమియం చెల్లించవలసినదిగా ఆయన రైతులకు మనవి చేశారు. వరికి రైతు ప్రీమియం హెక్టారుకు రూ:2,150/-లు , భీమా హెక్టారుకు రూ:1,07,500/-లు భీమా కంపెనీ (ఐసీఐసీఐ లొంబార్డ్ జీఐసీ లిమిటెడ్). భీమా నియమ నిబంధనల అనుసారం మాత్రమే వర్తించునన్నారు. మరిన్ని వివరాలకొరకు మీ ప్రాంత పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రం నందలి గ్రామ వ్యవసాయ లేదా గ్రామ ఉద్యాన సహాయకులను సంప్రదించాలని ఏవో రవికుమార్ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమములో వి.ఏ.ఏ కె.సౌభాగ్యవతి, డీ.రోషిణి, గ్రామ నాయకులు మరియు ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బసిరెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థులకు భోజన ప్లేట్లు పంపిణీ.



**గుడ్లూరు, పెన్ పవర్, ఆగస్టు 18:**

మండలంలోని బసిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ ఉపాధ్యాయులు రామ్మూర్తి భోజన ప్లేట్లను బహుకరించారు. వివరాలలోకి వెళితే బసిరెడ్డిపాలెం హైస్కూలు నందు స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తూ జూలై 31వ తేదీన మద్దసాని రామమూర్తి పదవీ విరమణ చేశారు. పాఠశాల విద్యార్థులకు తన వంతుగా మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలుగా విద్యార్థులు అందరికీ బోజన ప్లేట్లను పాఠశాలకు అందజేయగా, ప్రధానోపాధ్యాయులు కాపులూరి వెంకటేశ్వర్లు వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా దాత మద్దసాని రామమూర్తికి పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థుల తరుపున ప్రధానోపాధ్యాయులు కాపులూరి వెంకటేశ్వర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# బల్లికురవలో నాకాబంది

**సంతమాగులూరు, (బల్లికురవ) ఆగస్టు 1**

మండల కేంద్రమైన బల్లికురవ ..అద్దంకి ప్రధాన రహదారిలో, మంగళవారం ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో నా కా బంది కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో ఉదయం ఐదు గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం 7 గంటల వరకు కొనసాగింది. అనుమానిత వాహనాలను తనిఖీ చేస్తూ, సంబంధిత పత్రాలను పరిశీలించారు. వాహనదారులకు శాఖపరమైన పలు సూచనలు చేశారు.



# నేతన్న సేవలో పథకంలో అవినీతి ఆరోపణ పై విచారణ

**విచారణకు హాజరైన డి ఎల్ డి వో ఉమా దేవి**

**విచారణ అధికారి సమక్షంలోనే పిర్యాదు దారుడిపై దాడి**

**డి ఎల్ డి ఓ వాహనంలోనే పోలీస్ స్టేషన్ కి తరలింపు**

**హత్యయత్నానికి ప్రయత్నించినా వారిపై పిర్యాదు**

**సంతమాగులూరు, పెన్ పవర్ ఆగస్టు 18**



సంతమాగురు మండలం చవిటిపాలెం గ్రామంలో నేతన్న సేవలో పథకం లో అవినీతి ఆరోపణ పై విచారణ జరిపేందుకు వచ్చిన డి ఎల్ డి వో అధికారి ఉమాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి డి ఎల్ డి ఓ ఉమాదేవి స్వయంగా విచారణ చేస్తున్న సమయంలో కొంతమంది విచారణ మధ్యలో ఆపి ఫిర్యాదుదారుడు కందిమల్ల ఆదినారాయణ పై వాగ్వాదానికి దిగారు. డి ఎల్ డి ఓ ఉమాదేవి చూస్తుండగానే ఫిర్యాదుదారునిపై హత్యాయత్నం జరగడంతో అక్కడికక్కడే కింద పడిపోవటం జరిగింది. విషయాన్నీ గమనించిన డి యల్ డిఓ అధికారి వెంటనే స్పందించి తన వాహనంలో పోలీస్ స్టేషన్ కు తరలించి ఫిర్యాదుదారుడిపై జరిగిన దాడిని ఖండిస్తూ సంతమాగులూరు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయటం జరిగింది. ఫిర్యాదుదారునిపై ప్రాణహాని ఉందని ఫిర్యాదు దారుడు పోలీసులతో వాపోయాడు. తనకు ప్రాణహాని ఉందని తక్షణమే తనకు రక్షణ కల్పించాలంటూ పోలీసులను వేడుకున్నాడు. ఫిర్యాదుదారుడికి తీవ్రమైన గాయాలు కావటంతో సంతమాగులూరు ప్రాథమిక ఆరోగ్య సేవ కేంద్రంలో ప్రథమ చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రమైన గాయాలు తగలటంతో నరసరావుపేట లోని ఉన్నత ఆసుపత్రి కి తరలించాలని వైద్యులు తెలిపారు. పి జి పి ఆర్ ఎస్ లో చవిటి పాలెం గ్రామంలో నేతన్న సేవలో పథకంలో సుమారు 25 లక్షల రూపాయల అవినీతి జరిగిందని ఫిర్యాదారుడు ఆరోపించాడు. మంగళవారం చవిటిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు రమ్మని పంచాయతీ కార్యదర్శి తెలుపగా మధ్యాహ్నం 01 గం " సమయంలో వెళ్లడం జరిగింది. పంచాయతీ కార్యాలయం బయట సుమారు 20 మందికి పైగా అవినీతికి పాల్పడ్డ వారు నానా బూతులు తిడుతూ ఉండగా డి ఎల్ డివో విచారణ అధికారి ముందే నన్ను రోడ్డుమీద కిందపడేసి కాళ్లతో, రాళ్లతో చంపేందుకు దాడి చేశారు అని కందిమల్ల ఆదినారాయణ పేర్కొన్నారు.

## తూమాటి మాధవరావుకు జగన్ ఆశీస్సులు

**–శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు**





**కందుకూరు పెన్ పవర్,ఆగస్టు 18**

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ పదవికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్ ఆశీస్సులు తీసుకున్నారు. శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ అభ్యర్థిగా తూమాటి మాధవరావు పేరును వైఎస్ జగన్ ఇప్పటికే ప్రకటించారు. నామినేషన్ దాఖలు అనంతరం జగన్‌ను కలిసిన మాధవరావు పార్టీ పరంగా ఎన్నికల ప్రక్రియపై చర్చించారు. తూమాటి మాధవరావు ఎన్నిక సాఫీగా జరిగేలా పార్టీ ఎమ్మెల్సీలంతా సమన్వయంతో పనిచేసి పూర్తి మద్దతు అందించాలని వైఎస్ జగన్ సూచించారు. పార్టీ ఎమ్మెల్సీల సహకారంతో డిప్యూటీ ఛైర్మన్ ఎన్నిక విజయవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## శ్రీ గాయత్రిలో కెరీర్ లక్ష్యాలపై విద్యార్థులకు అవగాహన



**కందుకూరు, పెన్ పవర్ ఆగస్టు 18**

కందుకూరు శ్రీ గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్, ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ విభాగం ఆధ్వర్యంలో శ్రీధర్ కాంపిటేటివ్ అకాడమీ సౌజన్యంతో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, ఉద్యోగ అవకాశాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ రామ్ మోహన్‌రెడ్డి హాజరై విద్యార్థులకు పలు అంశాలపై మార్గదర్శకత్వం అందించారు. ఉన్నత విద్య, పోటీ పరీక్షల సన్నద్ధత, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగ అవకాశాలు, కెరీర్ ఎంపిక, ఉద్యోగ సాధనకు అవసరమైన నైపుణ్యాలపై ఆయన వివరించారు. విద్యార్థులు తమ అభిరుచులు, సామర్థ్యాలను గుర్తించి సరైన కెరీర్ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్లు ఇందిరాదేవి, రవితేజతో పాటు శ్రీధర్ కాంపిటేటివ్ అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు. పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, ఉద్యోగ అవకాశాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలి తదితర అంశాలపై విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. కళాశాల చైర్మన్ చింతలచెరువు రామకృష్ణారావు, డైరెక్టర్ చింతలచెరువు భరద్వాజ్, ప్రిన్సిపాల్ పోలిశెట్టి గీతా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని, క్రమబద్ధమైన ప్రణాళికతో చదువుతూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో లభించే ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## చినుకు కోసం ఎదురుచూపులు.. పాత ఆటలతో కాలక్షేపం

**సంతమాగులూరు, పెన్ పవర్ ఆగస్టు 18**

వర్షాలు కురవక వ్యవసాయ పనులు ముందుకు సాగకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, కూలీలు, మహిళలు ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఒకప్పుడు గ్రామీణ జీవితంలో భాగమైన పాతకాలపు ఆటలు మళ్లీ గుర్తుకొస్తున్నాయి. సంతమాగులూరు మండలంలో అత్యధిక జనాభా కలిగిన ఏల్చూరు గ్రామంలో మహిళలు సాయంత్రం వేళ ఆరుబయట చేరి అష్టాచెమ్మా, వైకుంఠపాళి, పులిమేక, వామనగుంటలు, దాగుడుమూతలు, తొక్కుడుబిళ్ల, నాలుగు రాళ్లు వంటి పాతకాలపు ఆటలు ఆడుతూ సరదాగా కాలక్షేపం చేస్తున్నారు. ఒకప్పుడు పంట పనుల విరామ సమయంలోనూ, పండుగలు, కుటుంబ వేడుకల సందర్భాల్లోనూ గ్రామీణులు ఈ ఆటలతో సందడి చేసేవారు. ఆధునిక కాలంలో సెల్‌ఫోన్లు, టీవీలు, ఇతర వినోద సాధనాలతో కనుమరుగవుతున్న ఈ ఆటలు ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడంతో మళ్లీ తెరపైకి వస్తున్నాయి. చినుకు కోసం ఎదురుచూస్తూనే మహిళలు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ పాత ఆటలను ఆడటం గ్రామీణ వాతావరణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



# గంజాయి అక్రమ రవాణాపై ఐఏఎస్ అధికారితో విచారణ జరిపించాలి

### కారులో గంజాయి, నగదుతో పట్టుబడిన ఎస్సైలపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేయాలి.

### అద్దంకి ఘటనపై హైకోర్టులో పిల్ వేస్తాం.. దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్.

**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 18:**

అద్దంకి ప్రాంతంలో వెలుగుచూసిన గంజాయి అక్రమ రవాణా ఘటనపై ఐఏఎస్ అధికారితో సమగ్ర విచారణ జరిపించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. కారులో గంజాయి తరలిస్తూ పట్టుబడిన సంతమాగులూరు, బల్లికురవ ఎస్సైలపై తక్షణమే ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరారు. మంగళవారం అద్దంకిలోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**మద్యం విందు అనంతరం ఘటన..**

బల్లికురవ గ్రానైట్ అక్రమ రవాణాకు సహకరించినందుకు ఏర్పాటు చేసిన మద్యం విందులో ఎస్సైలు పాల్గొన్నారని నాగేంద్రరావు ఆరోపించారు. ఆ విందు ముగించుకుని వస్తూ శంఖవరప్పాడు వద్ద ముగ్గురిని కారుతో ఢీకొట్టి ప్రమాదానికి గురిచేశారని పేర్కొన్నారు. ఈ ఘటనలో మద్యం సీసాలు, భారీ ఎత్తున నగదు, గంజాయితో సంతమాగులూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు, బల్లికురవ ఎస్సై నాగరాజులు స్థానిక ప్రజలకు పట్టుబడ్డారని తెలిపారు. విషయం తెలుసుకున్న అద్దంకి సీఐ సుబ్బరాజు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని, మద్యం మత్తులో ఉన్న ఆ ఇద్దరు ఎస్సైలను రాజేంద్ర అనే తెలుగుదేశం నాయకుడి కారులో అక్కడి నుంచి తప్పించారని విమర్శించారు. తమ పోలీసు అధికారులను రక్షించేందుకు దర్శి డీఎస్పీ బాలమురళీకృష్ణ కట్టుకథలు చెబుతున్నారని మండిపడ్డారు. కారులో దొరికిన డబ్బు, గంజాయి ఎవరివో తేల్చాలని, మద్యం సీసాలపై ఉన్న క్యూఆర్ కోడ్ ఆధారంగా వాటిని ఏ



దుకాణంలో కొనుగోలు చేశారో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

**మంత్రి గొట్టిపాటి స్పందించాలి..**

ప్రతిపక్షాలను గంజాయి బ్యాచ్ అని విమర్శించే ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో రక్షక భటులే గంజాయితో దొరికిపోయిన ఘటనపై తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. హోంమంత్రి అనిత స్పందించి నిందితులైన ఆ ఇద్దరు ఎస్సైలను అరెస్టు చేసి, విధుల నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. గతంలో మార్కాపురంలో ఓఎస్డీగా పనిచేసిన సమైజాన్ రావు రైళ్లలో దొంగతనాలు చేయించి చివరకు ఉద్యోగం కోల్పోయిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వంలో చట్టాలు అమలు చేయాల్సిన పోలీసులే ఇలా నేరాలకు పాల్పడటం




దారుణమన్నారు. ప్రకాశం జిల్లా ఎస్పీ సైతం పోలీసుల అక్రమ వసూళ్లను అరికట్టేలా కఠినంగా వ్యవహరించాలని కోరారు.

**హైకోర్టును ఆశ్రయిస్తాం..**

గ్రానైట్ వ్యాపారులు ప్రభుత్వానికి పన్నులు కట్టకుండా ఎగవేసేందుకు పోలీసులే సహకరిస్తున్నారని ఆయన ఆరోపించారు. కూటమి పాలనలో ఫ్రెండ్లీ పోలీసింగ్ ముసుగులో జరుగుతున్న అక్రమ వసూళ్లు, గంజాయి రవాణా ఘటనలపై హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) వేస్తామని నాగేంద్రరావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి దారా అంజయ్య, కాకుమాను రవి, నాయకులు కిరణ్ కుమార్, శ్రీకృష్ణ మాల సభ కన్వీనర్ మేడికొండ మురళి, ఎర్రమల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రకాశంలో ఏఐసీటీఈ- అటల్ జాతీయ అధ్యాపక శిక్షణా కార్యక్రమం




**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 18**

ప్రయోగశాలల్లో పుట్టిన పరిశోధనలను పరిశ్రమలకు, సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలుగా మలిచే లక్ష్యంతో ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల మరోసారి జాతీయ స్థాయిలో తన ప్రత్యేకతను చాటుకుంది. కళాశాల మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో ఏఐసీటీఈ--అటల్ అకాడమీ ప్రాయోజకత్వంలో "ప్రయోగశాల నుంచి మార్కెట్ వరకు సాంకేతిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి" అంశంపై ఆగస్టు 17 నుంచి 22 వరకు నిర్వహిస్తున్న ఆరు రోజుల జాతీయ స్థాయి అధ్యాపక శిక్షణా కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ సుజా ఎస్. నాయర్, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె. విజయ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. హెచ్. రవికుమార్, ఉప ప్రిన్సిపాల్ వి. హరిబాబు, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ కె. లక్ష్మీ పవని జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ సుజా ఎస్. నాయర్ మాట్లాడుతూ, ప్రయోగశాలల్లో రూపుదిద్దుకునే ఆవిష్కరణలు మార్కెట్‌కు చేరినప్పుడే వాటి అసలు విలువ వెలుగులోకి వస్తుందన్నారు. పరిశోధనను వాణిజ్యీకరణ దిశగా మలిచే సామర్థ్యాన్ని అధ్యాపకులు, పరిశోధకులు పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పరిశ్రమలు–విద్యాసంస్థల మధ్య బలమైన అనుసంధానం ఏర్పడినప్పుడే దేశాభివృద్ధికి అవసరమైన సాంకేతిక పరిష్కారాలు రూపుదిద్దుకుంటాయని తెలిపారు. కరస్పాండెంట్ డాక్టర్ కె. విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ, జాతీయ స్థాయి శిక్షణా కార్యక్రమాల నిర్వహణ ద్వారా ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలకు దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలతో విద్యా, పరిశోధన భాగస్వామ్యాలు మరింత విస్తరిస్తున్నాయన్నారు. అధ్యాపకుల్లో నవకల్పన, పరిశోధన, పారిశ్రామిక దృక్పథాన్ని పెంపొందించడం ద్వారా విద్యార్థులకు ప్రపంచ స్థాయి అవకాశాలు కల్పించడమే కళాశాల లక్ష్యమని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సి. హెచ్. రవికుమార్ మాట్లాడుతూ, నేటి సాంకేతిక విద్యలో బోధనతో పాటు పరిశోధన, ఆవిష్కరణ, పారిశ్రామిక అవసరాలపై అవగాహన అత్యంత కీలకమని అన్నారు. అటల్ శిక్షణా కార్యక్రమం అధ్యాపకుల నైపుణ్యాలను మరింత మెరుగుపరచి పరిశోధన ఫలితాలను సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలుగా తీర్చిదిద్దే దిశగా దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ ఆరు రోజుల శిక్షణా కార్యక్రమంలో మేధోసంపత్తి హక్కులు, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, స్టార్టప్‌ల స్థాపన, వ్యాపార నమూనాల రూపకల్పన, నిధుల సమీకరణ, మార్కెట్ వ్యూహాలు, పరిశోధన ఫలితాల వాణిజ్యీకరణ, పారిశ్రామికవేత్తల అభివృద్ధి వంటి సమకాలీన అంశాలపై దేశంలోని ప్రముఖ నిపుణులు శిక్షణ అందిస్తున్నారు. ప్రయోగశాలల్లో రూపుదిద్దుకున్న పరిశోధనలను మార్కెట్‌కు అనుసంధానం చేసే విధానాలపై ప్రత్యేకంగా దృష్టి సారించడం ఈ అటల్ శిక్షణా కార్యక్రమం విశిష్టతగా నిలిచింది. ఈ జాతీయ స్థాయి శిక్షణా కార్యక్రమంలో ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన ఇంజినీరింగ్ కళాశాలల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి డాక్టర్ కె. లక్ష్మీ పవని సమన్వయకర్తగా, శ్రీ ఎం. నిఖిల్ సహ సమన్వయకర్తగా వ్యవహరించారు. కళాశాల అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

### మొత్తం విలువ 1 కోటి 36 లక్షలు స్వాధీనం – జిల్లా ఎస్పీ వి హర్ష వర్ధన్ రాజు వెల్లడి






**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 18**

పగటి వేళ తాళం వేసిన ఇళ్ళలో చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగను జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీల విశ్లేషణ, సాంకేతిక ఆధారాలు, క్షేత్రస్థాయి దర్యాప్తు ద్వారా నిందితుడి కదలికలను గుర్తించి, అతనిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో 2026 జూన్ నుంచి ఆగస్టు వరకు నరసరావుపేట, మైలవరం, నూజివీడు, వినుకొండ, ఒంగోలు ప్రాంతాల్లో జరిగిన పలు నేరాల్లో అతని ప్రమేయం వెలుగులోకి వచ్చింది. కర్ణాటక రాష్ట్రం బెంగుళూరు నార్త్, ఇలయాజ్ మసీదు, గెద్దల హల్లి, వినాయక నగర్ కు చెందిన సోహైల్ ఖాన్ ఏ మహమ్మద్ సమీర్ ఖాన్ ప్రస్తుతం హైదరాబాదులోని షాహిద్ నగర్, చాంద్రాయణగుట్ట లో నివాసం ఉంటున్నాడు. ఈనెల 5వ తేదీన ఓకే రోజు ఒంగోలులోని ఆంధ్రకేసరి నగర్, సమతా నగర్ లోని వేరు వేరు ఇళ్లలో నిందితుడు దొంగతనాలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ రెండు ఘటనలపై ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదు అయ్యాయి. నిందితుడిపై రెండు తెలుగు రాష్ట్రాల్లో గతంలో కూడా వివిధ ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నిందితుడు దొంగతనం చేయబడి వచ్చిన నగదుతో బెట్టింగ్, క్యాసినోలకు పాల్పడి సుమారు రూ. 42 లక్షలు నష్టపోయినట్లు విచారణలో తెలిపాడు. వ్యక్తిగత అవసరాలు, జల్సాల కోసం డబ్బు అవసరమై దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడించాడు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు ఇతరుల మొబైల్ ఫోన్ ను దొంగిలించి, అందులోని సిమ్ ద్వారా ఓఎల్‌ఎక్స్ యాప్ ను ఉపయోగించి ఓటిపి ఆధారంగా ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేసేవాడు. వాటిపై వివిధ ప్రాంతాలకు వెళ్లి దొంగతనాలు చేసి, అనంతరం అదే విధంగా వాహనాలను విక్రయించేవాడు. దొంగిలించిన బంగారు ఆభరణాలను హైదరాబాద్ లోని షాహీద్ నగర్లోని అద్దె ఇంటికి తీసుకెళ్లి, తన వద్ద ఉన్న పరికరాలతో కరిగించి, బంగారు దుకాణాల్లో విక్రయించి నగదుగా మార్చుకునేవాడని విచారణలో వెల్లడైంది. అనంతరం మరలా ఒంగోలులో దొంగతనాలకు పాల్పడేందుకు ఎక్స్ యు వి 700 నిందితుడు కారులో సౌత్ బైపాస్‌లోని అలాస్ హోటల్ ఎదుట పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో పోలీసులను గమనించి వాహనాన్ని వెనక్కి తిప్పి పారిపోవడానికి ప్రయత్నించాడు. పోలీసులు వెంబడించి అతనిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి సుమారు రూ.1 కోటి 3 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, 15 లక్షలు నగదు,18 లక్షల విలువైన ఎక్స్ యువి 700 కారు స్వాదీనం చేసుకున్నారు. వాటి మొత్తం విలువ 1 కోటి 36 లక్షలు ఉంటుందని జిల్లా ఎస్పీ వి హర్ష వర్ధన్ రాజు తెలిపారు. పై కేసులను ఛేదించడంలో, నిందితుడిని చాకచక్యంగా అరెస్ట్ చేయడంలో, దొంగిలించిన సొత్తును రికవరీ చేయడంలో ప్రతిభ చూపిన ఒంగోలు డిఎస్ పి రాయపాటి శ్రీనివాసరావు, ఒంగోలు తాలూకా ఇన్స్పెక్టర్ టి. విజయ్ కృష్ణ, తాలూకా ఎస్ఐ షేక్ మహమ్మద్ ఫిరోజ్, ఒంగోలు 1 టౌన్ ఎస్ఐ నాగేంద్రరావు, సిబ్బందిని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు అభినందించి క్యాష్ రివార్డ్ అందజేశారు.

## వర్షం కోసం అల్లాను ప్రార్థించిన ముస్లిం సోదరులు





**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 18**

రైతులు ముమ్మరంగా వ్యవసాయ పనులు చేపట్టాల్సిన సమయం ఆసన్నమై, అత్యంత ప్రాముఖ్యత కలిగిన మఖ కార్తె ప్రారంభమైనప్పటికీ చినుకు జాడ లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు సాగర్ నాగార్జున సాగర్‌కు కూడా నీరు చేరకపోవడం పరిస్థితిని మరింత ఆందోళనకరంగా మారుస్తోంది. వర్షాలు కురిపించాలంటూ రైతులు గ్రామాల్లో పూజలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా సంతమాగులూరు మండలంలోని కొమ్మాలపాడు గ్రామంలో ముస్లిం సోదరులు కూడా వర్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంగళవారం గ్రామం వెలుపల సుమారు 500 మంది ముస్లిం సోదరులు ఒకచోట చేరి, "వర్షం కురిపించు అల్లా" అంటూ అల్లాను ప్రార్థించారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండేలా కరుణించాలని ప్రార్థనలు చేశారు.

## బాల్య వివాహాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు

**సి ఎస్ పురం పెన్ పవర్ ఆగస్టు 18**

బాల్య వివాహాలు నిర్వహించిన అందుకు ప్రోత్సహించిన కఠిన చర్యలు తప్పవని ఐసిడిఎస్ సూపర్వైజర్ దేవకృపావరం అన్నారు. మండలంలోని ఆర్కేపల్లి గ్రామంలో మంగళవారం దాసరి హరి నారాయణ 16 సం అమ్మాయికి బాల్య వివాహం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఐసీడీఎస్ సూపర్వైజర్ దేవ కృపావరం స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ లు కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించినారు. కుటుంబ సభ్యులకు బాల్య వివాహం నిర్వహించ కూడదని అవగాహన కల్పించారు. ప్రభుత్వాలు బాల్య వివాహాలపై కఠినమైన చట్టాలు తీసుకువచ్చాయని అందుకు పాల్పడేవారు ఎంతటి వారైనా శిక్షకు గురికాక తప్పదని హెచ్చరించారు అమ్మాయి కనీస వయస్సు 18 సంవత్సరాలు అబ్బాయి వయస్సు 21 సంవత్సరాలు నిండకుండా వివాహం జరిపినట్లయితే అబ్బాయికి 2 సంవత్సరాల జైలు శిక్ష, 1 లక్ష రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందని తెలియజేశారు. తెలిసి తెలియని వయసులో పిల్లలకు వివాహాలు జరిపి వారి జీవితాలను నాశనం చేయవద్దని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు .చిన్న వయస్సులో వివాహాలు జరపడం వల్ల పిల్లల్లో అనేక మార్పులు సంభవించి బలహీనపడటం, పుట్టే బిడ్డ ఎదుగుదల లేక ప్రాణాపాయ స్థితిలో చేరుకుంటారని వారు తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహిస్తున్నట్లు మీ దృష్టికి వస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1098 కు లేదా పోలీస్ శాఖ వారికి గాని ఐసిడిఎస్ శాఖకు లేదా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు గాని తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ నాగమణి,పంచాయతీ కార్యదర్శి గుర్రం బాబు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ పి.మస్తాన్ రావు, అంగన్వాడి కార్యకర్తలు రమణమ్మ, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.



# పోట్లూరులో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించిన పోలీసులు

**35 బైకులు, రెండు ఆటోలు సీజ్ -50 మంది పోలీస్ సిబ్బందితో తనిఖీలు.**

**గంజాయి వద్దు-జీవితమే ముద్దు నినాదాలతో భారీ ర్యాలీ -గంజాయిమత్తు నివారణపై అవగాహన, ప్రతిజ్ఞ.**





**గుడ్లూరు, పెన్ పవర్, ఆగస్టు 18:**

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కందుకూరు డీఎస్పీ పర్యవేక్షణలో గుడ్లూరు సర్కిల్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో మండలంలోని పోట్లూరు గ్రామంలో మంగళవారం ఉదయం కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిని మరియు ప్రధాన రహదారులలో పలు వాహనాలను పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా గంజాయి మత్తు ప్రమాదంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తూ "గంజాయి వద్దు – జీవితమే ముద్దు" అనే నినాదంతో గ్రామంలో వీధివీధినా పోలీసులు గ్రామ ప్రజలతో కలసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సంధర్భంగా గుడ్లూరు సర్కిల్ సీఐ రమేష్ మాట్లాడుతూ పై అధికారుల ఆదేశాలమేరకు పోట్లూరులో ఉదయం కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించడం జరిగినదన్నారు. ఈ సందర్భంగా తనిఖీలలో సరియైన అనుమతి పత్రాలు లేని 35 ద్విచక్రవాహనాలను, రెండు ఆటోలను సీజ్ చేయడం జరిగినదన్నారు. వీటిని స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగినదని, వాహనదారులు సరియైన అనుమతి పత్రాలను చూయించి వారి వాహనాలను తీసుకు వెళ్లవచ్చునన్నారు. ముఖ్యంగా గంజాయి మత్తు చాలా ప్రమాదకరం అని, ఎక్కడైనా గంజాయి అమ్ముతున్నా, సేవిస్తున్నా సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని సీఐ తెలిపారు. ఇటీవల గంజాయి వినియోగం యువతలో భారీగా పెరుగుతోందని, ప్రతీ రోజూ గంజాయి పట్టుబడ్డ వార్తలు వస్తూనే ఉన్నాయన్నారు. ముఖ్యంగా యువత పెద్ద ఎత్తున గంజాయికి అలవాటు పడుతున్నారని, ఆరోగ్యానికి హానికరమని తెలిసినా, ఈ దురలవాటును మాత్రం మానుకోలేకపోతున్నారన్నారు. అయితే గంజాయి తీసుకోవడం వల్ల శరీరంపై తీవ్రమైన ప్రభావం పడుతుందని ఆయన అన్నారు. గంజాయిని సేవించడం వల్ల, ఇది నిరాశ, మానసిక సమస్యలకు కారణమవుతుందని, గంజాయి సేవించే వారిలో క్యాన్సర్ ముప్పు ఎక్కువగా ఉంటుందన్నారు. గంజాయి ఇప్పటివరకు ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేసిందని, ఎన్నో నేరాలకు కారణమైందని, చాలామందిని జైళ్లలో మగ్గేలా చేసిందన్నారు. కాబట్టి ఈ వ్యాసనానికి దూరంగా ఉండి, సంతోషకరమైన జీవితాన్ని ఆస్వాదిస్తూ, గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ గా మన వంతు కృషి చేయాలని సీఐ రమేష్ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ డివిజన్ కు చెందిన 50 మంది ఎస్సై లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారని సీఐ రమేష్ తెలియజేశారు.

# వరి పంట భీమా నమోదు గడువు

## ఆగస్టు 31 వరకు పొడిగింపు

### వ్యవసాయాధికారి పి మధుబాబు



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 18**

వరి పంటకు పంటల భీమా నమోదు గడువును ఆగస్టు 31వరకు ప్రభుత్వం పొడగించడం జరిగిందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి మధుబాబు అన్నారు మంగళవారం మండలంలోని చింతపూడి నాగులవరం, అరివేముల గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం వలన వర్షపాతం తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉన్నందువలన పంటలు వేసిన రైతులు రైతు సేవా కేంద్రం సిబ్బంది ని సంప్రదించి పంట నమోదు మరియు పంటల భీమా పథకాలను ఉపయోగించుకోవలెనని అన్నారు రైతు సేవా కేంద్రాలలో యూరియా మరియు ఞూరా ఎరువులు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు ఉపయోగించుకోవాలని సూచించారు వరి పంటకు ఎకరానికి రూ.860 రూపాయల ప్రీమియంను ఆగస్టు 31 వ తేదీ లోపల చెల్లించినట్లయితే ఎకరానికి 43,000 రూపాయల భీమా పొందుటకు అర్హులని తెలిపారు. పంటలు సాగులో ఉన్న అన్ని గ్రామాల పరిధిలోని రైతు సేవ కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉంచి, ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి , గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

# పోలీసు సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేత



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 18**

ఆగస్టు 15 80వ స్వాతంత్ర్య దినోత్సవం నాడు నిర్వహించిన రోడ్డు సేఫ్టీ టీమ్ డెమోలో సమన్వయంతో సమర్థవంతంగా విధులు నిర్వహించిన పోలీస్ సిబ్బంది, 108 సిబ్బంది, ఆర్టీఏ అధికారులు, నేషనల్ హైవే సిబ్బంది, 1033 అంబులెన్సు, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బందిని మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు వివిధ శాఖలు సమన్వయంతో వేగంగా స్పందించి బాధితులకు తక్షణ సహాయం అందించడంతో పాటు, ప్రమాదాలకు కారణమయ్యే అంశాలను గుర్తించి భవిష్యత్తులో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టే లక్ష్యంతో 4ఈ (ఎమర్జెన్సీ ఎడ్యుకేటెడ్, ఇంజనీరింగ్ ఎన్ఫోర్స్మెంట్ ) కార్యక్రమాన్ని ప్రకాశం జిల్లా పోలీసులు చేపట్టారు. ఆగస్టు 15న నిర్వహించిన డెమోలో సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, ప్రమాదం జరిగిన వెంటనే పోలీస్, 108, ఆర్టీఏ, నేషనల్ హైవే, ఫైర్ తదితర శాఖలు ఏ విధంగా స్పందించాలి, బాధితులకు ఏ విధంగా సత్వర సహాయం అందించాలి అనే అంశాలను ప్రదర్శించారు. ఆగస్టు 15న నిర్వహించిన డెమోను విజయవంతం చేయడంలో కృషి చేసిన ప్రతి ఒక్కరినీ జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బీ ఇన్స్పెక్టర్ దేవప్రభాకర్, ట్రాఫిక్ సీఐ హాజరత్తయ్య, సోషల్ మీడియా ఇన్స్పెక్టర్ జగదీష్, ఆర్టిఏ కె. రామచంద్ర రావు, ఎస్సైలు బ్రహ్మనాయుడు, రాజేష్, కోటేశ్వరరావు, అంజి రెడ్డి, మాల్యాద్రి,సిబ్బంది డెమో లో పాల్గొన్న సిబ్బంది పాల్గొన్నారు.

# సంతమాగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలో లో ప్రత్యేక నాకాబంది





**సంతమాగులూరు, పెన్ పవర్ ఆగస్టు 18**

ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, దర్శి డిఎస్పి శ్రీ బాల మురళీకృష్ణ గారి పర్యవేక్షణలో సంతమాగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నేడు టోల్గేట్ వద్ద ప్రత్యేక నాకాబంది నిర్వహించబడింది. ఈ సందర్భంగా సంతమాగులూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ పి శేషగిరిరావు పర్యవేక్షణ లో, సబ్ఇన్స్పెక్టర్ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. నాకాబంది సందర్భంగా అనుమానాస్పద వాహనాలు మరియు వ్యక్తులపై కట్టుదిట్టంగా తనిఖీలు నిర్వహించబడినది. వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, భద్రతా ప్రమాణాలను పరిశీలించడంతో పాటు చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడానికి ప్రత్యేక దృష్టి పెట్టబడింది. వాహనదారులకు ట్రాఫిక్ నియమాలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని అవగాహన కల్పించబడింది. ప్రజల భద్రత కోసం ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించి, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాల గురించి వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు.

# మక్కెనవారిపాలెంలో నా పట్టు నా అభిమానం 2.0 కార్యక్రమం

**మలబరి నాటే ముందే భూపరీక్ష చేయించాలి - కేంద్ర పట్టు మండలి శాస్త్రవేత్త డాక్టర్ సౌజన్య**





**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 18**

సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం రైతు సేవా కేంద్రం నందు పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో "నా పట్టు నా అభిమానం 2.0"అనే కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా పట్టు రైతులకు కేంద్ర పట్టు మండలి శాస్త్రవేత్త డాక్టర్ సౌజన్య జిల్లా సహాయపట్టు పరిశ్రమ అధికారి ద్వారా మల్బరీ తోటల నిర్వహణ,యాజమాన్యం, పట్టు పురుగుల పెంపక గది రోగ కారక క్రిమీ నిర్మూలన చేయు విధానం, పట్టు పురుగుల పెంపకం మెళుకువలు మొదలగు అంశాల పై అవగాహన కల్పించడం జరిగింది. మల్బరీ తోటల రైతు మక్కెన పూర్ణచంద్రరావు పట్టు పురుగుల పెంపక గదిని పరిశీలన చేసి తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియ చేస్తూ మల్బరీ తోటలో వేరుకుల్లు వ్యాధి నిర్మూలన చేయు విధానం, ఏ విధంగా మట్టి నమూనాలు సేకరించడం ప్రదర్శన ద్వారా చూపిస్తూ రైతుల కు అవగాహన కలిగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర పట్టు మండలి శాస్త్రవేత్త డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ రైతులు పట్టుపురుగుల లో వచ్చే సమస్యను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు నివారణ ద్వారా తీసుకోవాలని తెలిపారు. మలబరి నాటిన భూములను నాణ్యతను నిర్దిష్టంగా ఉండేలా చూసుకోవాలి వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ పట్టు పరిశ్రమ శాఖ అధికారి పాండురంగ స్వామి రెడ్డి పట్టు పరిశ్రమ శాఖ క్షేత్ర స్థాయి సాంకేతిక సహాయకులు ఏపీసిఎన్ఎఫ్ సిబ్బంది, ఆర్ ఎస్ కె సిబ్బంది, పట్టు రైతులు గ్రామస్తులు పలువురు పాల్గొనడం జరిగింది.

# మెప్మా కార్యక్రమాల అమలులో పురోగతి సాధించాలి - డిఆర్డిఏ పిడి నారాయణ

**- ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని మెప్మా ఆధ్వర్యంలో సిఓ, ఆర్పీ లతో సమీక్ష సమావేశం**






**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 18**

ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో మెప్మా కార్యక్రమాల అమలులో మరింత పురోగతి సాధించి, రాష్ట్ర స్థాయిలో ముందంజలో నిలవాలని ప్రకాశం జిల్లా డిఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి నారాయణ సూచించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో సిఓలు, ఆర్పీ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ నారాయణ మాట్లాడుతూ పి ఎం ఎఫ్ ఎం ఈ, పీఎం ఈజిపి వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా మరింత మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు స్వయం ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పించి వారి ఆర్థిక స్థితిని మెరుగుపరచాలని తెలిపారు. అలాగే వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ప్రినర్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఎస్ హెచ్ జి మహిళ ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని, ప్రతి ఒక్కరూ తమకు అనుకూలమైన వ్యాపారాన్ని ప్రారంభించి జీవనోపాధిని పెంపొందించుకోవాలని సూచించారు. ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో మహిళలకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో తృప్తి క్యాంటీన్, చాయ్ రాస్తా, ఎగ్ కార్ట్, బ్యూటీ స్టోర్, రీచ్ మై స్టోర్ తదితర ప్రత్యేక ప్రాజెక్టులను ఏర్పాటు చేసి, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలని ఆయన సూచించారు. సమీక్ష సమావేశంలో వివిధ కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పురోగతి సాధించిన సిఓలు, ఆర్పీ లకు ప్రశంసా పత్రాలను ప్రాజెక్ట్ డైరెక్టర్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి. సంతోష్ కుమార్, టిఇ-బిల్ ప్రసాద్, టిఇ-ఐబి రఘు , టిఇ-ఎల్ హెచ్ సంపత్, ఒంగోలు కార్పొరేషన్ సిఓలు, ఆర్పీ లు పాల్గొన్నారు.

# విద్యార్థులకు దాతల చేయూత



**సంతమాగులూరు, పెన్ పవర్ ఆగస్టు 18**

సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామంలో విద్యాభివృద్ధికి స్థానిక దాతలు, ఉపాధ్యాయులు, యువత నడుం బిగించి కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామంలోని ఐదు ప్రాథమిక పాఠశాలలు, ఒక ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో 5, 6 తరగతులు చదువుతున్న 140 మంది విద్యార్థులకు ముస్తఫా మాస్టర్, కొలిశెట్టి మస్తాన్ రావు, ఏల్చూరు ఆర్టీసీ సిబ్బంది కలిసి రూ.5 వేల విలువైన ఇంగ్లీష్ రైటింగ్ పుస్తకాలు, పెన్సిళ్లు, ఎరేజర్లు అందజేశారు. ప్రతి విద్యార్థికి అవసరమైన విద్యా సామగ్రిని అందించి విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో నారదాసు శ్రీనివాసరావు, షేక్ బాజీషేదా, కే. సుధాకర్, కే. లక్ష్మయ్య (వంశీ), నారదాసు అన్వేష్, ప్రిపేర్ డ్రైవర్ ముస్తఫా తదితరులు పాల్గొని విద్యార్థులకు వ్రాత పుస్తకాలు అందించారు.

# టీ ఇస్తానని నమ్మించి చోరీ

**నిందితులను అరెస్టు చేసిన పోలీసులు -సుమారు రూ.24,50,000 విలువైన బంగారు ఆభరణాలు,**

**రెండు లక్షల విలువైన వెండి ఆభరణాలు స్వాధీనం**

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 18**



అద్దె ఇంట్లో నమ్మకంగా ఉంటూ టీ ఇస్తానని నమ్మించి ఇంట్లో ఉన్న బంగారు నగలు, ఆభరణాలను చోరీ చేసిన ముద్దాయిలను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.24,50,000 విలువైన బంగారు ఆభరణాలు, రెండు లక్షల విలువైన వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒంగోలు పట్టణంలోని దేవుడు చెరువునందు పార్కు దగ్గరలో వేలాయుధం రవణమ్మ నివాసం ఉంటుంది. కింది పోర్షన్లో అద్దె కు ఉంటున్న ఒంగోలు టౌన్ వేణుగోపాల స్వామి వీధి కి చెందిన బండారు వెంకటనారాయణ వరప్రసాద్, భార్య ఉప్పుతోళ్ల మహాలక్ష్మి రెండు నెలల నుంచి అద్దెకు ఉంటూ కార్ ట్రావెల్స్ తిప్పుకుంటూ ఉన్నారు. వెంకటనారాయణ వరప్రసాద్ తల్లి మూడు నెలల కిందట చనిపోవడంతో అప్పులు చేశాడు. ఆ అప్పులు తీర్చలేక ఆర్థిక సమస్యల నేపథ్యంలో భార్యా భర్తలు ఇద్దరూ కలిసి రవణమ్మను దేవుడి ప్రసాదం ఇస్తాము అని పిలిపించి, ఇంట్లో కూర్చోబెట్టి ఆమెకు ప్రసాదం పెట్టి, ప్రసాదం తింటుండగా ముద్దాయి భార్య టీ పెట్టుకు వస్తానని వెళ్లి రవణమ్మ ఇంట్లోకి ప్రవేశించి బీరువా లాకర్ ఓపెన్ చేసి అందులో ఉన్న బంగారు నగలు, వెండి వస్తువులను దొంగిలించారు. అనంతరం వారు హైదరాబాదులోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి మంగళవారం ఒంగోలు రాగా కొప్పోలు ఫ్లై ఓవర్ దగ్గర వీరిద్దరూ పోలీసులు చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వారిని ఒంగోలు వన్ టౌన్ సిఐ వెంకటేశ్వరరావు వారి సిబ్బంది పట్టుకొని చెక్ చేయగా వారి వద్ద ఉన్న 175 గ్రాముల బంగారం వస్తువులు, 850 గ్రాముల వెండి వస్తువులు స్వాధీన పరుచుకున్నారు. వాటి విలువ రూ.24,50,00 విలువైన బంగారు ఆభరణాలు, రెండు లక్షల విలువైన వెండి నగలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు చేసి సొత్తును రికవరీ చేశారు. ఈ సందర్భంగా ముద్దాయిలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఒంగోలు డిఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఒంగోలు వన్ టౌన్ సిఐ కె వెంకటేశ్వరరావు, సిసిఎస్ సీఐ ఏ కమలాకర్, ఒంగోలు వన్ టౌన్ క్రైమ్ పార్టీ ఏఎస్ఐ కే సురేష్, సాయి, విజయ్, కానిస్టేబుల్ అనిల్, సిసిఎస్ సిబ్బంది, ఖాదర్, అంజి బాబు, రఘు, రవి లను ఎస్పీ హర్షవర్ధన్ రాజు అభినందించారు.

# వాహనదారులకు జరిమానా.. జైలు శిక్ష

## ట్రాఫిక్ సీఐ హజరతయ్య

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 18**

మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వాహనదారులకు కోర్టు లో హాజరు పరచగా జరిమానా, జైలు శిక్ష విధించినట్లు ఒంగోలు ట్రాఫిక్ సిఐ సిహెచ్ హజరతయ్య తెలిపారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు విసిబుల్ పోలీసింగ్, వాహనాల తనిఖీలలో భాగంగా ఒంగోలు ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో 13 మందిని కోర్టుకు హాజరుపరచగా 11 మంది వాహనదారులకు ఒక్కొక్కరికి పదివేల చొప్పున జరిమానా విధించారని, ఇద్దరు వాహనదారులకు ఒక్కొక్కరికి పది రోజులు చొప్పున జైలు శిక్ష విధించారని సిఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, హెల్మెట్ లేకుండా, సీటు బెల్టు ధరించకుండా వాహనాలు నడప రాదని, మైనర్ డ్రైవింగ్ చేయరాదని వాహనదారులకు సూచించారు.



# పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రికి అర్జున అవార్డు.. క్రీడా పురస్కారాల పూర్తి జాబితా...

- 2025 సంవత్సరానికి గాను జాతీయ క్రీడా పురస్కారాలు
- మొత్తం 17 మంది క్రీడాకారులను వరించిన అర్జున పురస్కారం
- ఈ ఏడాది ఎవరికీ మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డు ప్రకటించని కేంద్రం
- చెస్ సంచలనం దివ్య దేశ్‌ముఖ్, అథ్లెట్ తేజస్విన్ శంకర్‌కు కూడా అర్జున
- పలువురు కోచ్‌లకు ద్రోణాచార్య, క్రీడా ప్రముఖులకు జీవన సాఫల్య పురస్కారాలు




**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి గాను జాతీయ క్రీడా పురస్కారాలను మంగళవారం ప్రకటించింది. భారత బ్యాడ్మింటన్ దిగ్గజం, కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రిని ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డు వరించింది. మహిళల డబుల్స్‌లో తన భాగస్వామి ట్రీసా జాలీతో కలిసి పుల్లెల గాయత్రి ఈ పురస్కారానికి ఎంపికైంది. వీరితో పాటు డెకాథ్లాన్ అథ్లెట్ తేజస్విన్ శంకర్, చెస్ ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ సహా మొత్తం 17 మంది క్రీడాకారులకు అర్జున అవార్డులను ప్రకటించారు. అయితే, ఈ ఏడాది దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డును ఎవరికీ ప్రకటించకపోవడం గమనార్హం.సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సిఫార్సుల మేరకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఈ అవార్డుల జాబితాను విడుదల చేసింది. గత నాలుగేళ్లుగా నిలకడగా రాణిస్తూ, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించిన వారికి అర్జున అవార్డును ప్రదానం చేస్తారు. కామన్వెల్త్ క్రీడల్లో డెకాథ్లాన్‌లో పతకం గెలిచిన తొలి భారతీయ అథ్లెట్‌గా తేజస్విన్ శంకర్ చరిత్ర సృష్టించగా, ఫిడే మహిళల ప్రపంచ కప్ గెలుచుకుని దివ్య దేశ్‌ముఖ్ సంచలనం రేపారు. హాకీ క్రీడాకారుడు హార్దిక్ సింగ్ పేరు ఖేల్ రత్న కోసం పరిశీలనకు వచ్చినప్పటికీ, అతను పోటీ నుంచి తప్పుకోవడంతో ఈసారి ఎవరికీ ఈ పురస్కారం దక్కలేదని తెలిసింది.

సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు అరుమై నాయగంను అర్జున అవార్డు (జీవన సాఫల్యం) వరించింది. 1962 జకార్తా ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత జట్టులో ఆయన సభ్యుడు. కోచ్‌లకు ఇచ్చే ద్రోణాచార్య అవార్డులు ముగ్గురిని వరించాయి.

**అవార్డు గ్రహీతల పూర్తి జాబితా:**

అర్జున అవార్డు గ్రహీతలు (17 మంది)
తేజస్విన్ శంకర్, మహమ్మద్ అజ్మల్, ప్రియాంక గోస్వామి (అథ్లెటిక్స్)
ట్రీసా జాలీ, పుల్లెల గాయత్రి (బ్యాడ్మింటన్)
నరేందర్ బెర్వాల్ (బాక్సింగ్)
విదిత్ సంతోష్ గుజరాతీ, దివ్య దేశ్‌ముఖ్ (చెస్)
లాల్రెమ్సియామి, రాజ్‌కుమార్ పాల్ (హాకీ)
సుర్జీత్, పూజ (కబడ్డీ)
ధనుష్ శ్రీకాంత్, రుద్రాంశ్ ఖండేల్వాల్ (పారా షూటింగ్)
ఏక్తా భయాన్ (పారా అథ్లెటిక్స్)
అరవింద్ సింగ్ (రోయింగ్)
అఖిల్ షెయోరాన్ (షూటింగ్)
అర్జున అవార్డు (జీవన సాఫల్యం)
అరుమై నాయగం (ఫుట్‌బాల్)
ద్రోణాచార్య అవార్డు (కోచ్‌లు)
ఛోటే లాల్ యాదవ్ (బాక్సింగ్)
పర్వీర్ సింగ్ (అథ్లెటిక్స్)
నేహా నందకుమార్ చవాన్ (షూటింగ్)
జీవితకాల సాఫల్య పురస్కారం (ధ్యాన్‌చంద్ అవార్డు)
ధర్మేంద్ర సింగ్ యాదవ్ (బాక్సింగ్)
వీరేందర్ కుమార్ (రెజ్లింగ్)
రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్
ఆర్మీ పారాలింపిక్ నోడ్, పుణే

# 84కే 4 వికెట్లు.. మరో 288 రన్స్ చేస్తేనే లంక గెలిచేది.. లేకపోతే విజయం భారత్‌దే





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ వర్సెస్ శ్రీలంకల మధ్య జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ నాలుగో రోజు ముగిసే సమయానికి టీమిండియా పూర్తి పైచేయి సాధించింది. ఆతిథ్య లంక జట్టు ముందు 372 పరుగుల భారీ లక్ష్యాన్ని పెట్టింది. ఇక ఇన్నింగ్స్ లో లభించిన 178 పరుగుల ఆధిక్యంతో నాలుగో రోజు బరిలోకి దిగిన భారత్, చివరకు శ్రీలంకను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టింది. లంక గెలవాలంటే ఇంకా 288 పరుగులు చేయాల్సి ఉండగా, టీమిండియాకు చారిత్రాత్మక విజయం సాధించడానికి కేవలం 6 వికెట్లు తీస్తే సరిపోతుంది. భారత జట్టు రెండో ఇన్నింగ్స్ ప్రదర్శన ఆశించిన స్థాయిలో కొనసాగలేదు. క్రమశిక్షణతో కూడిన లంక బౌలింగ్‌కు వరుసగా ఇండియన్ బ్యాటర్లు వికెట్లు పారేసుకోవడంతో జట్టు 193 పరుగులకే ఆలౌట్ అయింది. అయినప్పటికీ, తొలి ఇన్నింగ్స్‌లో సాధించిన 178 పరుగుల భారీ లీడ్ పుణ్యమా అని శ్రీలంక ముందు 372 పరుగుల టార్గెట్ ని ఉంచగలిగింది. గాలే పిచ్‌పై చివరి రోజు ఈ కొండంత స్కోరును ఛేజ్ చేయడం లంకకు కష్టమే అని చెప్పాలి.


**84/4 వద్ద నిలిచిన నాలుగో రోజు ఆట:**

లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆఖరి సెషన్‌లో భారత బౌలర్లు బ్రేకులు వేశారు. పక్కా ప్లానింగ్‌తో దాడి చేసిన టీమిండియా బౌలర్లు, లంక టాప్ ఆర్డర్‌ను దెబ్బతీస్తూ 4 కీలక వికెట్లను నేలకూల్చారు. వెలుతురు లేమి

కారణంగా 34 ఓవర్లు ముగిశాక నాలుగో రోజు ఆటను నిలిపివేసే సమయానికి శ్రీలంక 84 పరుగులకు 4 వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో కూరుకుపోయింది. ప్రస్తుతం క్రీజులో సోనల్ దినూష (25 రన్స్), ధనంజయ డి సిల్వా (31) నాటౌట్ గా కొనసాగుతున్నారు. కాగా మ్యాచ్ రేపటికి వాయిదా పడినప్పటికీ, విజయం మాత్రం దాదాపు భారత్ సొంతమైనట్లే కనిపిస్తోంది.

# గిల్‌క్రిస్ట్ వరల్డ్ రికార్డ్ బ్రేక్ చేసిన పంత్.. టెస్టుల్లో 100 సిక్సర్లు పూర్తి!






**హైదరాబాద్ పెన్ పవర్:** భారత వికెట్‌కీపర్-బ్యాటర్ రిషభ్ పంత్ టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ సుదీర్ఘ ఫార్మాట్‌లో 100 సిక్సర్లు పూర్తి చేసుకున్న తొలి భారతీయ బ్యాటర్‌గా అరుదైన మైలురాయిని అందుకని రికార్డు పుస్తకాల్లో తన పేరును లిఖించుకున్నాడు. భారత్ ఆడుతున్న తాజా టెస్ట్ మ్యాచ్‌లో తన ట్రేడ్‌మార్క్ అటాకింగ్ షాట్‌తో ఈ ఘనత సాధించాడు. అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే 100 లేదా అంతకంటే ఎక్కువ సిక్సర్లు బాదిన నాలుగో బ్యాటర్‌గా పంత్ నిలిచాడు.

రిషభ్ పంత్ అటాకింగ్ శైలి ఎంత ప్రమాదకరమైనదో అతని గణాంకాలే చెబుతున్నాయి. టెస్టుల్లో ప్రతి 49 బంతులకు ఒక సిక్సర్ చొప్పున బాది పంత్ సంచలనం సృష్టించాడు. ఈ విషయంలో దిగ్గజ కీపర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ (ప్రతి 67 బంతులకు ఒక సిక్సర్) రికార్డును కూడా పంత్ సునాయాసంగా బ్రేక్ చేసేశాడు.

**ఒత్తిడిలోనూ పంత్ సూపర్ హాఫ్ సెంచరీ:**

తరచుగా విమర్శలు ఎదుర్కొనే పంత్, కష్టసమయంలో జట్టుకు కొండంత అండగా నిలిచాడు. మొదటి సెషన్‌లో భారత్ వరుసగా వికెట్లు కోల్పోయి కుప్పకూలే ప్రమాదంలో పడిన వేళ, పంత్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. ఈ క్రమంలోనే పంత్ తన టెస్ట్ కెరీర్‌లో 20వ అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. జట్టుకు టాప్ స్కోరర్‌గా నిలిచి, భారత జట్టు ఆధిక్యాన్ని 350 పరుగుల దాకా తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించాడు.

టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన విధ్వంసకర బ్యాటర్ల ఎలైట్ క్లబ్‌లో పంత్ చేరాడు. ఈ జాబితాలో టాప్-4లో ఉన్న ఆటగాళ్ళు:

బెన్ స్టోక్స్ - 138 సిక్సర్లు
బ్రెండన్ మెక్‌కలమ్ -107 సిక్సర్లు
రిషభ్ పంత్ - 100లి సిక్సర్లు
ఆడమ్ గిల్‌క్రిస్ట్ - 100 సిక్సర్లు

# 2026లో రౌడీ దర్శనం లేనట్లేనా?





విజయ్ దేవరకొండ కమ్ బ్యాక్ మూవీ కోసం తన అభిమానులు చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. గీత గోవిందం విజయ్ చివరి క్లీన్ హిట్. ఆ తర్వాత తన సినిమాలన్నీ నిరాశపరిచాయి. గత ఏడాది వచ్చిన 'కింగ్డమ్'తో బలంగా పుంజుకుంటాడనే అంచనాలు కలిగాయి కానీ.. అది నిజం కాలేదు. ఆ సినిమా ఓ మాదిరిగా ఆడి వెళ్లిపోయింది.ఐతే విజయ్‌కి ఉన్న అదృష్టం ఏంటంటే.. ఎన్ని ఫ్లాపులు ఇచ్చినా తన ఫాలోయింగ్, మార్కెట్ అలాగే కొనసాగుతున్నాయి. క్రేజీ ప్రాజెక్టులు తన చెంతకు వస్తున్నాయి. గత ఏడాది అతను ఒకేసారి రెండు భారీ చిత్రాలను మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. అందులో ఒకటి రణబాలి కాగా.. ఇంకోటి రౌడీ జనార్ధన. వీటిలో మొదటిది సెప్టెంబరులో, రెండోది డిసెంబర్లో రిలీజ్ కావాల్సింది. రెంటికీ రిలీజ్ డేట్లు కూడా ఇచ్చారు. కానీ ఈ రెండూ అనుకున్నట్లుగా విడుదల కావట్లేదు.'రణబాలి' వాయిదా అని ఇంతకుముందే క్లారిటీ వచ్చేసింది. ఇప్పుడు 'రౌడీ జనార్ధన' సైతం డిసెంబరులో రిలీజ్ కాదని తెలుస్తోంది. 'రణబాలి' ముందే ఆలస్యం కాగా.. హీరోయిన్ రష్మిక మందన్నా గాయంతో మరింత లేట్ అవుతోంది. ఈ సినిమా షూట్ ఇంకా 30 శాతం దాకా మిగిలి ఉన్నట్లు సమాచారం. మరోవైపు 'రౌడీ జనార్ధన' వర్క్ 50 శాతం దాకా బ్యాలెన్స్ ఉందట. ఈ రెంటిలో ఏదీ ఈ ఏడాదిలో పూర్తయి ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు లేదు. కాబట్టి రౌడీ దర్శనం కోసం 2027 వరకు ఎదురు చూడాల్సిందే. ఐతే వచ్చే ఏడాది ఈ రెంటితో పాటు మరో చిత్రంతోనూ విజయ్ ప్రేక్షకులను పలకరించే అవకాశముంది. రణబాలి, రౌడీ జనార్ధన వచ్చే ఏడాది ప్రథమార్ధంలోనే రిలీజ్ అవుతాయి. 'హాయ్ నాన్న' ఫేమ్ శౌర్యువ్‌తో అనౌన్స్ చేసిన సినిమాను సెకండాఫ్‌లో ప్రేక్షకుల ముందుకు తెచ్చే అవకాశముంది. కాబట్టి ఈ ఏడాది సినిమా లేకపోయినా.. వచ్చే ఏడాది విజయ్ అభిమానులను మూడు చిత్రాలతో మురిపించే ఛాన్సుంది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com